టెండర్లపై తేల్చరేం..!?




తుంగభద్ర దిగువ కాలువకు చేసిన ఆర్‌సీసీ లైనింగ్ (ఫైల్)

- టీబీపీ ఎల్లెల్సీ, హెచ్చెల్సీ సీసీ లైనింగ్ పనులకు..
- వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.400 కోట్లతో టెండర్లు
- రెండేళ్లయినా పనులు మొదలు పెట్టని కాంట్రాక్టర్లు
- పనుల రద్దుకు టీడీపీ కూటమి ప్రభుత్వం ఆదేశాలు

తుంగభద్ర ప్రాజెక్టు ఎల్లెల్సీ, హెచ్చెల్సీల ఆర్‌సీసీ లైనింగ్ పనుల కోసం 2023 జనవరిలో రూ.400 కోట్లతో టెండర్లను పిలిచారు. బళ్లారిలో స్థిరపడిన ప్రకాశం జిల్లాకు చెందిన ఓ బడా కాంట్రాక్టరుకు లబ్ధి చేకూర్చేందుకు నాటి వైసీపీ ప్రభుత్వంలోని ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాలకు చెందిన ఓ మంత్రి, ఇద్దరు ముగ్గురు ఎమ్మెల్యేలు టెండర్లలో చక్రం తిప్పారు. టీడీపీ కూటమి ప్రభుత్వం రాగానే వైసీపీ ప్రభుత్వ హయాంలో టెండర్లతో ఆగిన పనులను రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. అయితే ఆ పనుల్లో ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు బోర్డుకు వర్తించవని కీలకమైన అధికారి ఒకరు అన్నట్లు సమాచారం. ఏపీ ప్రభుత్వం ఆదేశాల మేరకు 'రివర్స్' టెండర్లు టీబీపీ బోర్డు రద్దు చేసింది. అలాంటప్పుడు టెండర్లతో ఆపేసిన పనులు రద్దు చేయాలని ఏపీ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు ఎందుకు వర్తించవు..? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. వైసీపీ రంగు పూసుకున్న బడా కాంట్రాక్టరుకు లబ్ధి చేకూర్చేందుకు అనంతపురం జిల్లాకు చెందిన టీడీపీ కూటమి ముఖ్య నాయకులు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

కర్నూలు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోడుమూరు నియోజకవర్గాల్లో తుంగభద్ర దిగువ కాలువ (టీబీపీ ఎల్లెల్సీ) పరిధిలో ఖరీఫ్, రబీలో 1,51,134 ఎకరాల ఆయకట్టు ఉంది. ఆదోని, ఎమ్మిగనూరు మున్సిపాలిటీ పట్టణాలు సహా 194 గ్రామాలకు తాగు, సాగునీరు అందిస్తున్నారు. కరువు పల్లెసీమల జీవనాడి అయిన ఎల్లెల్సీ కాలువకు తుంగభద్ర జలాశయంలో కేడబ్ల్యూడీటీ-1 అవార్డు ప్రకారం 24 టీఎంసీలు నికర జలాల వాటా ఉంది. ఈ నీటిని జిల్లాకు అందించేందుకు 0/0 కి.మీల నుంచి కర్నూలు జిల్లా ఆదోని మండలం హానవాల్ సమీపంలో 250.850 కి.మీల వరకు తుంగభద్ర ఎల్లెల్సీ కాలువ, అలాగే.. అనంతపురం జిల్లాలో సాగు, తాగునీరు అందించేందుకు 31.50 టీఎంసీలు నికర జలాలు వాటా ఉన్న టీబీపీ హెచ్చెల్సీ కాలువ 0/0 నుంచి అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ సమీపంలో 105 కిలో మీటర్ల వరకు తుంగభద్ర ప్రాజెక్టు (టీబీపీ) బోర్డు పర్యవేక్షణలో ఉన్నాయి. 70 ఏళ్ల క్రితం కాలువలు నిర్మించడంతో పలు ప్రాంతాల్లో కాలువ గట్లు బలహీనంగా మారడమే కాకుండా పూడిక చేరడంతో వాటా జలాలు అందడం లేదు. దీనికితోడు ఎగువన కర్ణాటక జల చౌర్యం సరేసరి. ఎల్లెల్సీ ఆధునికీకరణలో భాగంగా 2022 ఫిబ్రవరి 26న కాలువ 115.275 కి.మీల నుంచి 205.275 కి.మీల వరకు రూ.448 కోట్లతో చేపట్టే ఆర్‌సీసీ లైనింగ్ పనులు దాదాపుగా పూర్తి చేశారు.



తుంగభద్ర జలాశయం (ఫైల్)



తుంగభద్ర దిగువ కాలువ (ఫైల్)

ప్రభుత్వం మారినా పెత్తనం వారిదే..!

ప్రభుత్వం ఏదైనా తుంగభద్ర బోర్డులో వైసీపీ రంగు పూసుకున్న ఓ కాంట్రాక్టర్ పెత్తనమే చెలామణి అవుతోంది. గత ఎన్నికల్లో ఆయన వైసీపీ టికెట్ ఆశించి భంగపడ్డాడు. ఆయనకు ప్రయోజనం కలిగించేందుకు బోర్డులోని కీలక అధికారి ఒకరు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అనంతపురం జిల్లాకు చెందిన టీడీపీ కూటమి ప్రజాప్రతినిధులు కూడా ఆ కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూరేలా వ్యవహరిస్తున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. అంతేకాదు ఆ కాంట్రాక్టర్లతో టీడీపీ కూటమి ప్రజాప్రతినిధులు అమరావతిలో ఇటీవల రహస్యంగా భేటీ అయ్యారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ప్రభుత్వం, పాలకులు మారారే తప్ప.. తుంగభద్ర బోర్డు పనుల్లో వైసీపీ కాంట్రాక్టర్లు, ఆ పార్టీ నాయకుల పెత్తనమే జరుగుతోందని కర్నూలు జిల్లాకు చెందిన అధికార పార్టీ నాయకుడు ఒకరు ఆవేదన వ్యక్తం చేయడం కొసమెరుపు. ఇప్పటికైనా టెండర్లు రద్దు చేస్తారా.. కొనసాగిస్తారా..? అన్నది టీబీపీ బోర్డు అధికారులు తేల్చాల్సి ఉంది.

రద్దు చేస్తారా.. కొనసాగిస్తారా..?

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2023 జనవరి 1న కర్నూలు జిల్లాలో టీబీపీ ఎల్లెల్సీ 205.45 కి.మీల నుంచి 250 కి.మీల వరకు రూ.300 కోట్లు, అనంతపురం జిల్లాలో హెచ్చెల్సీ రూ.100 కోట్లు కలిపి రూ.400 కోట్లతో ఆర్‌సీసీ లైనింగ్ పనులు 13 ప్యాకేజీలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు పిలిచారు. ఈ టెండర్లలో నాడు వైసీపీ ప్రభుత్వం పెద్దల అండతో బళ్లారిలో స్థిరపడిన ప్రకాశం జిల్లాకు చెందిన వైసీపీ బడా కాంట్రాక్టర్ ఒకరికి ప్రయోజనం చేకూర్చేలా నాటి బోర్డు అధికారి ఒకరు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఈ ఆరోపణల నేపథ్యంలో ఓ కాంట్రాక్టరు తెలంగాణ హైకోర్టును కూడా ఆశ్రయించాడు. ఈ టెండర్ల బాగోతంలో రూ.20 కోట్లకు పైగా చీకటి ఒప్పందం జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. కాంట్రాక్టర్లతో తుంభద్ర బోర్డు ఇంజనీర్లు ఒప్పందం (అగ్రిమెంట్) చేసుకున్నా పనులు మొదలు పెట్టలేదు. 2024 జూన్‌లో కొలుదీరిన టీడీపీ కూటమి ప్రభుత్వం వైసీపీ హయాంలో టెండర్లతోనే ఆపేసిన పనులు రద్దు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఏపీ ప్రభుత్వ ఉత్తర్వులు బోర్డుకు వర్తించవని ఓ అధికారి అంటున్నారు. అయితే అదే ఏపీ ప్రభుత్వం రివర్స్ టెండర్లు రద్దు ఉత్తర్వులు వర్తించినప్పుడు.. పనులు రద్దు ఉత్తర్వులు ఎందుకు వర్తించవని కాంట్రాక్టర్లు ప్రశ్నిస్తున్నారు.

గ్రూప్-2 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లాలో 30 కేంద్రాలు ఏర్పాటు
- హాజరు కానున్న 9,993 మంది అభ్యర్థులు
- కలెక్టర్ రంజిత్ బాషా
- ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకూడదు
- జాయింట్ కలెక్టర్ నవ్య



మాట్లాడుతున్న కలెక్టర్, జేసీ

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-2 పరీక్షలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో ఏపీపీఎస్సీ, గ్రూప్-2 మెయిన్స్ పరీక్షల నిర్వహణపై లైజెన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లుతో కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 30 కేంద్రాల్లో 9,993 మంది అభ్యర్థులు గ్రూప్-2 పరీక్షలకు హాజరు అవుతున్నారన్నారు. పరీక్షల నిర్వహణకు జాయింట్ కలెక్టర్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. ప్రశ్నాపత్రాలను సెంటర్లకు పోలీస్ సెక్యూరిటీలతో క్లోజ్డ్ వాహనాలతో తీసుకుని వెళ్లాలని లైజెన్ ఆఫీసర్లకు సూచించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, జిరాక్స్ షాపులను మూసివేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు లైజెన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు ఏపీపీఎస్సీ నుంచి వచ్చిన ఆదేశాలను, సూచనలను ఖచ్చితంగా పాటించాలన్నారు. జాయింట్ కలెక్టర్ నవ్య మాట్లాడుతూ 23వ తేదీ ఉదయం 5.30 గంటలకు కలెక్టరేట్‌కు వచ్చి స్ట్రాంగ్ రూమ్ వద్ద నుంచి ప్రశ్నాపత్రాలను తీసుకువెళ్లాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో ఉదయం 8.30 గంటల నుంచి అభ్యర్థులను లోపలికి అనుతించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు ఉదయం జరిపే పరీక్షలకు 9.45 తర్వాత, మధ్యాహ్నం జరిగే పరీక్షలకు 2.45 తర్వాత అభ్యర్థులను లోనికి అనుమతించకూడదన్నారు. అరగంట ముందుగానే ఓఎంఆర్ షీట్స్ అరగంట ముందుగా పరీక్ష హాలులోకి పంపించాలన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్‌ఫోన్లు, టాబ్స్ ఐపాడ్స్ స్మార్ట్ వాచ్, డిజిటల్ వాచ్, క్యాలిక్యులేటర్స్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకూడదన్నారు. శారీరక వైకల్యం ఉన్నవారికి స్క్రైబ్ సౌకర్యం ఉందని తెలిపారు. ఏవైనా సందేహాలు ఉంటే 08518-277305ను ఫోన్ చేసి నివృత్తి చేసుకోవాలన్నారు. ఎక్కడైనా మాల్ ప్రాక్టీసు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుశేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఆర్వో వెంకటనారాయణమ్మ, కర్నూలు ఆర్డీవో సందీప్ పాల్గొన్నారు.

ప్రసవ వేదన..!



ఆత్మకూరు పరిధిలోని కొట్టాల చెరువు పీహెచ్‌సీ

- నంద్యాల పీహెచ్‌సీల్లో ప్రసవాలు అంతంతే
- లక్ష్యానికి దూరంగా 80 శాతం ఆసుపత్రులు
- కొన్నింటిలో జీరో ప్రసవాలు
- 10 నెలలు.. 1,029 కాన్పులు

నంద్యాల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మాతా శిశు మరణాలు జరగకుండా ఎక్కడిక్కడ గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించి సురక్షిత ప్రసవాలు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన (పీహెచ్‌సీ) ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు నంద్యాల జిల్లాలో ఆశించిన స్థాయిలో లేదు. వైద్యులు కూడా ప్రసవాల కోసం వచ్చే గర్భిణులపై ఏమాత్రం దృష్టిపెట్టడం లేదు. ఆసుపత్రికి వస్తే చాలు.. జిల్లా ఆసుపత్రులకు రెఫర్ చేయడమే పనిగా పెట్టుకున్నారు. తద్వారా మెజార్టీ పీహెచ్‌సీల్లో ప్రసవాలు లక్ష్యానికి చేరేకోలేకపోతున్నాయి. కొన్ని చోట్ల మరీ దారుణం. నెలలో ఒక ప్రసవం కూడా నమోదు కాని దుస్థితిలో ఉన్నాయి. ఏది ఏమైనా జిల్లాలోని కొన్ని పీహెచ్‌సీలలోని వైద్యుల పనితీరు.. ఆ శాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనపడుతోంది. ఈ క్రమంలో ప్రభుత్వ ఆశయం అభాసుపాలు కావడంతో పాటు జిల్లాలోని బాధిత గర్భిణులకు తిప్పలు తప్పడం లేదు.

నంద్యాల జిల్లాలోని 52 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కలవు. ఆయా ఆసుపత్రుల్లో 24 గంటలు వైద్యసేవలు అందించాల్సిందే. ఒక్కొక్క పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులతో పాటు 10 నుంచి 13మంది సిబ్బంది ఉంటారు. ప్రభుత్వం జిల్లాలోని ప్రతి పీహెచ్‌సీలోను నెలకు ఐదు ప్రసవాలు చేయాలనే లక్ష్యం విధించింది. ఆ దిశగా జిల్లాలో ప్రతి పీహెచ్‌సీ వైద్యులు పనిచేయాలి. కానీ క్షేత్రస్థాయిలో ఆ దిశగా జిల్లాలోని చాలామంది వైద్యులు ఎక్కడా పనిచేయడం లేదు. కొన్నిచోట్ల వైద్యులు లేకుండానే.. నర్సులే ప్రసవాలు చేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఇదిలా ఉండగా రాత్రి వేళ వస్తే ఇక అంతే సంగతులు. వైద్య సిబ్బంది లేరంటూ వెనక్కు పంపేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాలో పది నెలల్లో ప్రసవాలు	
ఏప్రిల్	: 99
మే	: 104
జూన్	: 138
జూలై	: 130
ఆగస్టు	: 96
సెప్టెంబరు	: 99
అక్టోబరు	: 97
నవంబరు	: 81
డిసెంబరు	: 101
జనవరి (2025)	: 84
మొత్తం జరిగిన ప్రసవాలు	: 1029

నంద్యాల జిల్లాలో ఇలా..	
జిల్లాలోని పీహెచ్‌సీల సంఖ్య	: 52
గత 10 నెలల్లో జరిగిన ప్రసవాలు సంఖ్య	: 1,029
టార్గెట్ మేరకు ప్రతి నెల జరగాల్సినవి	: 260
గత 10 నెలల్లో జరగాల్సిన ప్రసవాల టార్గెట్	: 2,600
పది నెలల్లో కనిపించిన వ్యత్యాసం	: 1,571
ఒక్క ప్రసవం కూడా చేయని పీహెచ్‌సీలు	: 05

లక్ష్యానికి దూరంగా 80 శాతం పీహెచ్‌సీలు

జిల్లాలోని 52 పీహెచ్‌సీల్లో 80 శాతం పీహెచ్‌సీల్లో ప్రసవాల పరంగా చేధించడం లేదని అధికార లెక్కలు చెప్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం.. జిల్లాలోని 52 పీహెచ్‌సీల్లో నెలకు.. 260 చొప్పున.. ఈ పది నెలల్లో అన్ని పీహెచ్‌సీల్లో కలిసి 2,600 ప్రసవాలు జరగాల్సి ఉంది. కానీ అధికార లెక్కల ప్రకారం కేవలం 1,029 ప్రసవాలు మాత్రమే జరిగాయి. అంటే ఈ పది నెలల వ్యవధిలోనే.. లక్ష్యంలో 1571 ప్రసవాలు తక్కువగా ఉన్నాయి. దీన్నిబట్టి చూస్తే వైద్యుల పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కొన్ని పీహెచ్‌సీల్లో మరీ దారుణం. లక్ష్యం ప్రకారం జరగాల్సిన ఐదు ప్రసవాలు కూడా చేయకపోవడం గమనార్హం.

మిగతా 6వ పేజీలో

టమోటా రైతులను ఆదుకుంటాం

జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య

7

హంస వాహనంపై ముక్కంటి విహారం

- వైభవంగా సాగుతున్న మహాశివరాత్రి ఉత్సవాలు
- భక్తులతో కిక్కిరిసిన శ్రీశైలం
- నేడు టీటీడీ, కాణిపాకం నుంచి పట్టు వస్త్రాలు



శ్రీశైలం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): వేలాది గొంతుకల శివనామస్మరణ.. వేదమంత్రాల నడుమ.. శివపరివారం వెంటరాగా శ్రీశైల మల్లికార్జునుడు భ్రమరాంబ అమ్మవారితో హంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. కిక్కిరిసిన భక్తజన సందోహం నడుమ సాంస్కృతిక నృత్యాలు సాగుతుండగా స్వామివారి వాహనసేవ కన్నుల పండువగా సాగింది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు శుక్రవారం భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు హంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఉభయ దేవాలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో ప్రత్యేక అలంకృతులైన స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను సుగంధ పుష్పాలతో అలంకరించి హంసవాహనంపై కొలువుదీర్చారు. అనంతరం ఆలయ అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజాదికాలు, హారతులు సమర్పించి, అనంతరం మంగళవాయిద్యాలు, కళాకారుల సంగీత, జానపద నృత్యాల నడుమ క్షేత్రపురవీధుల్లో గ్రామోత్సవం జరిపారు. గ్రామోత్సవం ముందు కోలాటం, చెక్కభజన, రాజభటుల వేషాలు, జానపద పగటి వేషాలు, గొరవయ్యలు, బుట్టబొమ్మల నృత్యాలు, బీరప్పడోలు, తప్పెట్లు, డ్రమ్స్, భజంత్రీలు, భంజారా నృత్యం, చెంచునృత్యం, శంఖునాదాలు మార్మోగాయి.





కళాకారుల ప్రదర్శన

నేడు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాల సమర్పణ

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు ఉదయం కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం, రాత్రి తిరుమల తిరుపతి దేవస్థానం తరపున స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించనున్నారు.

నేడు మయూరవాహన సేవ : శ్రీశైలంలో మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం నాలుగో రోజు భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారికి మయూరవాహనసేవ, గ్రామోత్సవం నిర్వహిస్తారు.



సర్వ పాపాల నుంచి విముక్తిని ప్రసాదించే పరమశివుడే బందీ అయ్యాడు. ఎలాంటి పూజలు, కైంకర్యాలు లేకుండా ఏకంగా రెండేళ్లుగా ఓ ఇనుప షెడ్డులో ఉంటున్నాడు. నంద్యాల జిల్లా కేంద్రానికి సమీపంలోని అయ్యలూరు శివాలయంలో స్వామివారు పూజలకు నోచుకోవడం లేదు. దేవాలయాల జీర్ణోద్ధరణ నిర్లక్ష్యం చేయడమే కాకుండా దేవుడి సొమ్మును తమ వ్యక్తిగత విలాసాలకు వాడుకోవడంతోనే ఆలయ పునరుద్ధరణ ఆగి స్వామి పూజలు నిలిచిపోయినట్లు స్థానికుల ద్వారా తెలుస్తోంది.



శివలింగాన్ని ఉంచిన రేకుల షెడ్డు ఇదే...

శివయ్యకే శిక్ష...!

- రెండేళ్లుగా రేకుల షెడ్డులో శివలింగం
- అధికారుల నిర్లక్ష్యం.. కాంట్రాక్టర్ వైఫల్యం
- ఎక్కడికక్కడే ఆగిన పునరుద్ధరణ పనులు
- ఎటూతెగని అయ్యలూరు ఆలయ వివాదం

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అయ్యాలూరు గ్రామంలో శివుడిని రెండేళ్లుగా చిన్న రేకుల షెడ్డులో ఉంచి తాళాలు వేశారు. జీర్ణోద్ధరణలో భాగంగా దేవదాయ శాఖ ఆధ్వర్యంలో రెండేళ్ల క్రితం శివాలయ పునర్నిర్మాణం ప్రారంభమైంది. నెల్లూరుకు చెందిన కాంట్రాక్టర్ పోతినేని ప్రసాదు ఈ ఆలయ నిర్మాణానికి రూ.72.16 లక్షలకు కాంట్రాక్ట్ దక్కించుకున్నారు. సుమారు రూ.14.40 లక్షలు మేర ఖర్చు చేసి మిగిలిన పనులను నిర్లక్ష్యంగా వదిలేశాడు. ఇందుకు సంబంధించి బిల్లు కూడా మంజూరైంది. రెండు సంవత్సరాలైనా గుడి నిర్మాణం ముందుకు సాగకపోవటంతో గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవదాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం.. నిలువెత్తు స్వార్థం పరమ శివుడి పాలిట శిక్షలా మారింది. అప్పటి ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి సైతం గుడి నిర్మాణం గురించి పట్టించుకోకపోవటంతో శివలింగాన్ని నిర్మాణం జరుగుతున్న ఆవరణలో రేకుల షెడ్డులో ఉంచారు. అప్పటి నుంచి పూజలకు శివుడు దూరంగా ఉన్నాడు.

మంత్రి దృష్టికి తీసుకెళ్లాం

దేవాలయ పునరుద్ధరణ అంచనాలను రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ దృష్టికి తీసుకెళ్లాం. అప్పట్లో గర్భగుడి, అర్ధమండపానికి మాత్రమే అంచనా వేశాం. మంత్రి ఆదేశాల మేరకు ముఖమండపం, ఫ్లోరింగ్, ధ్వజస్తంభం, ప్రహరీ, విమానగోపురానికి అదనంగా రూ.2 కోట్లతో రివైజ్డ్ ఎస్టిమేషన్ వేశాం. కాంట్రాక్టర్ వచ్చి నిర్మాణ పనులు చేపడతారు.

- శ్రీనివాస ప్రసాద్, డీఈ

వర్గ విభేదాలతో కోర్టుకెక్కారు

గ్రామంలోని రెండు వర్గాలకు పొసగడం లేదు. ఓ వర్గం శివలింగం ఎత్తు పెంచాలని, మరో వర్గం శివలింగాన్ని కదిలించకుండా నిర్మాణ పనులు చేపట్టాలని కోర్టుకెక్కారు. కోర్టు యథావిధిగా నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించింది. గ్రామంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో నిర్మాణాన్ని ముందుకు సాగించలేక పోయాను.

- పోతినేని ప్రసాద్, కాంట్రాక్టర్



ఆదిలోనే ఆగిన శివాలయ నిర్మాణం

కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేశాం

కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీచేశాం. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే శివాలయ నిర్మాణం ఆదిలోనే ఆగిపోయింది. కాంట్రాక్టర్‌కు మరోసారి నోటీసులు అందజేసి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. ఆలయ పునరుద్ధరణకు వేగవంతంగా చర్యలు తీసుకుంటాం.

- వేణునాథ రెడ్డి, ఈఓ

శివయ్యకు పూజలు జరగాలి

వీలైనంత త్వరగా శివాలయ నిర్మాణ పనులు పూర్తి చేయాలి. నిర్మాణం పూర్తి కాకపోవడం వల్ల శివుడు బందిఖానాలో ఉంటూ పూజలకు నోచుకోవడం లేదు. నిర్మాణం పూర్తిచేసి శివలింగ ప్రతిష్ఠ చేస్తే గ్రామానికి మేలు జరుగుతుంది. శివాలయ నిర్మాణ పనులు ఆగి పోవడానికి అధికారులు నిర్లక్ష్యమే ప్రధాన కారణం.

- శంకరమ్మ, గ్రామస్థురాలు



ఎంపీడీవో, ఏపీవోలకు షోకాజ్ నోటీసులు

- ప్రజలు వలసలు వెళ్లకుండా పనులు కల్పించండి
- కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం రోజువారి, వారపు లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యంగా ఉన్న పెద్దకడుబూరు, ఎంపీడీవో, కౌతాళం, ఏపీవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా డ్వామా పీడీని ఆదేశించారు. శుక్రవారం ఉపాధి హామీ పథకం అమలు, హౌసింగ్ అంశాలపై ఏపీడీలు, ఎంపీడీవోలు, ఏపీవోలు, హౌసింగ్ అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించకపోవడం వల్లనే ప్రజలు వలసలు వెళితే ఎంపీడీవో, ఏపీవో, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ల మీద చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల పర్యటన వివరాలతో టూర్ డైరీలను కూడా సమర్పించాలని ఆదేశించారు. ఉపాధి పనులు కల్పించడంలో సి. బెళగల్, వెల్దుర్తి, పత్తికొండ, ఎమ్మిగనూరు, దేవనకొండ, ఆదోని, తుగ్గలి, పెద్దకడుబూరు, నందవరం, ఓర్వకల్లు, కౌతాళం, కోడుమూరు మండలాలు వెనుకబడ్డాయన్నారు. ఆదోని మండలం నుంచి ఫీల్డ్‌కు వెళ్లి పరిశీలించి నివేదిక ఇవ్వాలని డ్వామా పీడీని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలు, కులం సర్టిఫికెట్లు జారీ చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం రూరల్‌లో 3 సెంట్లు, అర్బన్‌లో 2 సెంట్లు స్థలం మంజూరు చేయమని ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసిందని అన్నారు. హౌస్ సైట్స్ రివెరిఫికేషన్, లబ్ధిదారుల గుర్తింపుపై తగిన చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్, ఆర్డీవోలను ఆదేశించారు. టెలి కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డ్వామా పీడీ వెంకటరమణయ్య, హౌసింగ్ పీడీ అజయ్ కుమార్, మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

కొండెక్కిన కొబ్బెర

- రిటైల్ మార్కెట్లో కేజీ రూ.200
- టెంకాయ రూ. 35
- కుంభమేళా ఎఫెక్ట్ అంటున్న వ్యాపారులు



కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : వంటింట్లో విరివిగా వాడే కొబ్బెర ధర గత కొద్ది రోజులుగా భారీగా పెరిగింది. రిటైల్ మార్కెట్లో కేజీ కొబ్బెర ధర రూ.200కు చేరుకుంది. కొబ్బెర ఇంత ధర గతంలో ఎన్నడూ లేదని వ్యాపారులు సైతం పేర్కొంటున్నారు. రూ.90 నుండి రూ.100, 120 వరకు ఉన్న కొబ్బెర అతి తక్కువ కాలంలో ఇంత పెరగడంతో కొనలేని పరిస్థితి నెలకొంది. దేశంలో కొబ్బెర దిగుబడులు తగ్గి పోవడమే దీనికి ప్రధాన కారణమని పలువురు పేర్కొంటున్నారు. నిన్న మొన్నటి వరకు రూ.15, 20లోపు ఉన్న టెంకాయ ధర ఏకంగా రూ.30 నుండి రూ.40వరకు చేరుకుంది. మన రాష్ట్రంలో కోస్తాలో విస్తారంగా లభించే కొబ్బరి కాయలు కుంభమేళాకు తరలుతున్నందు వల్ల కూడా ధరలు పెరిగాయి. దీంతో కొందరు వ్యాపారులు కర్ణాటకలోని తుముకూరు, గౌరీబిదనూరు, పావగడ ప్రాంతాల నుండి టెంకాయలు దిగుమతి చేసుకుంటున్నట్లు వ్యాపారులు తెలిపారు.

శ్రీశైలంలో ఏర్పాట్ల పరిశీలన



మాట్లాడుతున్న ఈఓ ఎం. శ్రీనివాసరావు

శ్రీశైలం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఆలయ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. శుక్రవారం ఈఓ ఎం.శ్రీనివాసరావు ఏర్పాట్లను పరిశీలించారు. భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లు, శివదీక్షా శిబిరాలు, పార్కింగ్ ప్రదేశాలు, 30 పడకల వైద్యశాలలను తనిఖీ చేశారు. క్యూలైన్లో వేచివున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుడదని, నిరంతరం భక్తులకు అల్పాహారం, మంచినీటిని అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈఓ వెంట ఈఈ నరసింహారెడ్డి, ఏఈఓ హరిదాసు తదితరులు ఉన్నారు.

ప్రసవ వేదన..!

(5వ పేజీ తరువాయి)

రెఫర్‌తో సరిపెడుతున్న కొందరు వైద్యులు

నెల కాదు.. రెండు నెలలు కాదు.. ఏకంగా 10 నెలలు పాటు ఒక ప్రసవం కూడా చేయని పీహెచ్‌సీలు జిల్లాలో ఉండటం విమర్శలకు తావిస్తోంది. ఆశాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణ సైతం ఆశించిన స్థాయిలో లేకపోవడంతో సదరు పీహెచ్‌సీ వైద్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విషయం ప్రసవాల గణాంకాలు చూస్తుంటే తెలుస్తోంది. జిల్లాలో చాలా వరకు వైద్యులు స్థానికంగా ఉండకపోవడం.. రాత్రి వేళలో అందుబాటులో లేకపోవడంతో ప్రసవాల లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు. కొన్ని ప్రాంతాల్లో వైద్యులు, వైద్యసిబ్బంది కుమ్మక్కై ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించి సొమ్ముచేసుకుంటున్నారనే ఆరోపణలు లేకపోలేదు. మరికొందరు వైద్యులైతే పరిస్థితి విషమంగా ఉందంటూ (హైరిస్క్) జిల్లా ఆసుపత్రులకు రెఫర్ చేసి చేతులు దులుపుకుంటున్నారు. మొత్తంగా కొందరు వైద్యులు నిర్లక్ష్యం.. ఆశాఖ ఉన్నతాధికారులు పర్యవేక్షణ లోపంతో ప్రసవాల పరంగా లక్ష్యాన్ని చేధించలేకపోతున్నారని స్పష్టంగా తెలుస్తోంది. ఇప్పటికైనా ఆశాఖ ఉన్నతాధికారులు స్పందించి లక్ష్యం దిశగా ప్రసవాలు జరిగే విధంగా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

లక్ష్యం ప్రకారం చేసేలా చర్యలు
- డీఎంహెచ్ వెంకటరమణ



జిల్లాలో ప్రతి పీహెచ్‌సీలో లక్ష్యం మేరకు ప్రసవాలు జరిగే విధంగా చర్యలు తీసుకుంటాం. ప్రసవాలు చేయని వైద్యులు తగిన ఆదేశాలు జారీ చేశాం. రాత్రి వేళల్లో కూడా అందుబాటులో ఉండాలి. అనవసరంగా రెఫర్ చేసినా.. ప్రవేట్ ఆసుపత్రులకు పంపించినా సంబంధిత వైద్యులు, వైద్య సిబ్బందిపై తగిన చర్యలు తీసుకుంటాం. ఆకస్మిక తనిఖీలు ముమ్మరం చేసి ప్రసవాలు ఎక్కువగా జరిగే విధంగా చూస్తాం.

ప్రకృతి అందాల మధ్య ఉల్లెడకొండ మల్లేశుడు



ఉల్లెడకొండలో ప్రకృతి పందిరి

మహాశివరాత్రికి ఏర్పాట్లు

రుద్రవరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రికి ఉల్లెడ కొండపై మల్లేశ్వరస్వామి సన్నిధిలో ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ఆళ్లగడ్డ, అహోబిలం రహదారి నాగంబాయి నుంచి 18 కిమీ, నంద్యాల ఒంగోలు రహదారి పచ్చర్ల పైభాగం నుంచి 18కిమీ మధ్యలో ఉల్లెడ మల్లేశ్వరస్వామి వెలిశారు. మహాశివరాత్రికి భక్తులు వెళ్లేందుకు సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కొండ గుహల మధ్య, ప్రకృతి పందిరి కింద వెలసిన స్వామివారిని సేవించేందుకు భక్తులు శివరాత్రి రోజున వెళతారు. అడవికి, వన్యప్రాణులకు హానీ తలపెట్టవద్దని, నిప్పు పెట్టవద్దని అధికారులు భక్తులకు సూచించారు.



ఉల్లెడకొండలో స్వయంభువుగా వెలసిన నాగపడిగ దృశ్యం



పార్వతీదేవి అమ్మవారు, ఉల్లెడ మల్లేశ్వరస్వామి

పారదర్శకంగా ఏఎన్ఎం గ్రేడ్-3 పదోన్నతులు


కర్నూలు డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఏఎన్ఎం గ్రేడ్-3 పదోన్నతుల కౌన్సెలింగ్‌ను పారదర్శకంగా నిర్వహిస్తామని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ వెల్లడించారు. ఈ మేరకు ఈ నెల 21న ఆంధ్రజ్యోతిలో 'ఏఎన్ఎం గ్రేడ్-3 పదోన్నతుల్లో గందరగోళం' అన్న వార్తకు డీఎంహెచ్‌వో వివరణ ఇచ్చారు. జిల్లాలోని 35 పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ల ద్వారా స్పష్టమైన తుది జాబితాను సిద్ధం చేసిన తర్వాత పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ఇంకా ఎక్కడైనా ఖాళీలు, అభ్యంతరాలు ఉంటే మెడికల్ ఆఫీసర్ ద్వారా సేకరించి ఏఎన్ఎంలకు అన్యాయం జరగకుండా చూస్తామన్నారు. గ్రామ, వార్డు, సచివాలయ, హెల్త్ కార్యదర్శుల పదోన్నతుల కోసం ఈ నెల 17న ఏఎన్ఎం గ్రేడ్-3 పదోన్నతుల జాబితాను విడుదల చేశామన్నారు. రెండో ఏఎన్ఎం, ఈసీ ఏఎన్ఎం ఖాళీలకు పొజిషియన్ ఐడీ ఉండదని, జీతాలు రావడం ఆలస్యమవతుందన్న ఉద్దేశంగా వాటిని ఖాళీలుగా చూపించలేదని వివరించారు. పొజిషియన్ ఐడీ లేకుండా జీతాలు రావడం ఆలస్యమవుతుందని అందుకే నంద్యాల జిల్లాలో వీటిని సరి చేసుకుని జాబితా పంపించాలని డీఎంహెచ్‌వో కోరారు. లద్దగిరి పీహెచ్‌సీలోని అమడకుంట్ల, లద్దగిరి, గోనెగండ్ల పీహెచ్‌సీలో వెలుగోడు, గోనెగండ్ల, హెచ్.ఖైరవాడి, కల్లూరు పీహెచ్‌సీలో సల్కాపురం, షరీన్‌నగర్, నందవరం పీహెచ్‌సీలో ముగతి, నందవరం-1 కనకవీడు, ఇన్‌పొజిషియన్‌లో ఉన్నాయన్నారు. గోనెగండ్ల పీహెచ్‌సీలోని కులుమాల, కోసిగి పీహెచ్‌సీలోని కోసిగి-4, నందవరం పీహెచ్‌సీలోని నందవరం-2 యరోపియన్ ఏఎన్ఎం పోస్టులు, పోలకల్ పీహెచ్‌సీలోని గుడిపాడు, నాగులాపురం, జులేకర్, ఉలిందకొండ, పీహెచ్‌సీలోని బొమిరెడ్డిపల్లెలో రెండో ఏఎన్ఎం పోస్టులు ఉన్నాయనీ తెలిపారు.

ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ

- ప్రజల మద్దతుతో బ్రిటీష్ పాలకులపై తొలి తిరుగుబాటు
- నేడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 178వ వర్ధతి



ఉయ్యాలవాడ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): భరతమాతను బ్రిటీషు పాలన నుండి విముక్తి చేయడానికి రాయలసీమలో గర్జించిన తొలి స్వాతంత్ర సమరయోధుడు రేనాటి పాలెగాడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి. ఆయన 1847 ఫిబ్రవరి 22న కోవెలకుంట్లలోని ట్రెజరీ సమీపంలో ఉన్న జుర్రేటి వాగు వద్ద బ్రిటీషు వారు ఉరి తీసి ఉరి కొయ్యకు వేలాడ దీశారు. నేడు నరసింహారెడ్డి 178వ వర్ధంతి.

నరసింహారెడ్డి జీవిత చరిత్ర

నరసింహా రెడ్డి 1806 నవంబరు 24న పెద్దమల్లారెడ్డి, సీలమ్మల దంపతులకు రూపనగుడి గ్రామంలో జన్మించారు. ఉయ్యాలవాడలో పెరిగారు. సమీపంలోని గుళ్లదుర్తి గ్రామంలో విద్యాభ్యాసం చేశారు. అప్పటి నొస్సం జమీందారు చెంచు మల్లారెడ్డి మనవడు నరసింహారెడ్డి. చెంచు మల్లారెడ్డికి కుమారులు లేనందున వారసత్వం దృష్ట్యా తన కుమార్తె కొడుకు(మనవడు) అయిన నరసింహారెడ్డిని తన 22వ ఏట దత్తత తీసుకొని తన అధికారం కింద ఉన్న కర్నూలు, కడప, అనంతపురం, బళ్లారి ప్రాంతాలకు పాలెగాడిగా పట్టాభిషేకం చేస్తారు. అప్పటి నుంచి నరసింహారెడ్డి దాదాపుగా 70 గ్రామాలకు పాలెగాడిగా ఉండేవారు. 1842లో అప్పటి బ్రిటీషు ప్రభుత్వం పాలెగాళ్ల వ్యవస్థను రద్దుచేసి నరసింహారెడ్డి దత్తత గ్రామాలను స్వాధీనం చేసుకొని చెంచు మల్లారెడ్డికి ప్రతి నెల రూ. 11 భరణం ఇచ్చింది. చెంచు మల్లారెడ్డి మరణం అనంతరం వంశ పారపర్యంగా బ్రిటీషు వారు ఇచ్చే నెల వారి భరణం నరసింహారెడ్డికి రావలసి ఉంది. ఇలా బ్రిటీషు వారు పాలగాళ్ల వ్యవస్థను రద్దు చేసి దత్తత గ్రామాలను స్వాధీనం చేసుకొని ఆ ప్రాంత ప్రజలను పన్నుల పేరుతో హింసిస్తూ ఇబ్బందులు పెట్టవారు.

నరసింహారెడ్డి వీర గాథ

1846లో నరసింహారెడ్డికి రావలసిన నెల వారి భరణం కోసం తన అనుచరుడ్ని కోవెలకుంట్లలోని తహసీల్దారు కార్యాలయానికి పంపించారు. అయితే అక్కడి బ్రిటీషు తహసీల్దారు భరణం ఇవ్వకుండా నరసింహారెడ్డి అనుచరుడ్ని అవమానించి పంపించాడు. అయితే పన్నుల పేరుతో బ్రిటీషు వారు ప్రజలను హింసిస్తుండటం సహించలేని నరసింహారెడ్డి అప్పటికే బ్రిటీషు ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారు. తనకు రావలసిన భరణం ఇవ్వకపోవడంతో నరసింహారెడ్డికి ఆగ్రహం వచ్చింది. 1846 జూలై 10న తహసీల్దారును చంపుతున్నట్లు తన దత్తత గ్రామాల్లో చాటింపు వేయించారు. తాను అనుకున్న సమయానికి నరసింహారెడ్డి ప్రజలు చూస్తుండగా కోవెలకుంట్ల తహసీల్దారును నరికి వేసి ట్రెజరీలోని ఖజానాను కొల్లగొట్టి ఆ ప్రాంత ప్రజలకు పంచి పెట్టారు. ఈ విధంగా నరసింహారెడ్డి బ్రిటీషు వారిపై తన తొలితిరుగుబాటును ప్రారంభించారు. అనంతరం బ్రిటీషు వారు నొస్సం గ్రామంలో ఉన్న ఆయన కోటపై దండయాత్ర చేసి కోటను ధ్వంసం చేశారు. నేటికి ఆ కోట గోడలు అలానే ఉన్నాయి. నరసింహారెడ్డి అక్కడి నుంచి అహోబిలానికి వెళ్లి పాలెగాళ్లను అందరినీ ఏకం చేసి దేశం నుంచి బ్రిటీషు వారిని తరిమి వేయాలని సంకల్పించారు. నరసింహారెడ్డిపై ఆగ్రహంతో ఉన్న అప్పటి కడప కలెక్టర్ కాంక్రైన్ తన అనుచరుల్లో ఒకరికి ధనం ఆశచూపి లోబరుచుకున్నాడు. 1847 ఫిబ్రవరి 22న నరసింహారెడ్డిని గిద్దలూరు ప్రాంతంలోని జగన్నాథ గట్టుపై బ్రిటీష్ సైన్యం చుట్టుముట్టి పట్టుకుంది. కోవెలకుంట్లలోని జుర్రెట్టి వాగు వద్ద ప్రజలు సమక్షంలో బహిరంగంగా ఉరి తీశారు. ప్రజలను భయాందోళనలకు గురి చేయాలని అతని తలను 30 ఏళ్ల పాటు ఊరి వాకిలికి వేలాడ దీశారు.



కోర్టు భవనాలు త్వరగా నిర్మించండి



న్యాయవాదులతో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి

జిల్లా న్యాయాధికారి కబర్ధి

ఆదోని రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కోర్టు భవనాలను త్వరగా నిర్మించాలని జిల్లా న్యాయాధికారి కబర్ధి అన్నారు. శుక్రవారం ఆదోనికి వచ్చిన కపర్థి బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మొలగవల్లి జనార్ధన్, జనరల్ సెక్రటరీ సురేంద్ర పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న కోర్టు భవనాలను ఆయన పరిశీలించారు. వేగవంతంగా, నాణ్యతతో సకాలంలో భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు. లోక్ ఆదాలత్‌లో కేసులను పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా జడ్జి వెంట సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ సెషన్స్ జడ్జి పి.జె. సుధా, సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞ నారాయణ, ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి లీలా సుభాష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి అర్చన, న్యాయవాదులు పాల్గొన్నారు.

కృష్ణానది యాజమాన్య బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలి

- రాయలసీమ సాగునీటి సమితి డిమాండ్



మాట్లాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డి

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది యాజమాన్య బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని రాయలసీమ సాగునీటి సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని గాంధీచౌక్‌లో మహాత్ముడి విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోర్డును విజయవాడలో ఏర్పాటు చేస్తే సహించేది లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ప్రకటనపై ప్రజా, రైతుసంఘాలు భగ్గు మంటున్నాయన్నారు. ప్రశ్నించాల్సి ప్రతిపక్షం కేసులకు భయపడి నోరు మెదపడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో విజయవాడ వేదికలో కర్నూలులోనే బోర్డును ఏర్పాటు చేయాలని తీర్మానం చేసినట్లు తెలిపారు. నీటి హక్కుల విషయంలో పాలకుల నిర్లక్ష్యం వల్ల రాయలసీమ తీవ్రంగా నష్టపోతోం దని ఆవేదన వ్యకం చేశారు. శ్రీశైలం రిజర్వాయర్‌లో నిల్వ ఉంచాల్సిన 1200 టీఎంసీలు దిగువకు వదిలిపెడుతూ రాయలసీమ రైతుల గొంతు కోశారని తీవ్రంగా విమర్శించారు. విద్యుత్ ఉత్పత్తి పేరుతో నీటిని తరలిస్తున్న తెలంగాణ ప్రభుత్వ చర్యలను అడ్డుకోవాల్సిన అధికార, ప్రతిపక్ష పార్టీలు పట్టించుకో లేదన్నారు. కేడీసీసీ డైరెక్టర్ రామసుబ్బారెడ్డి, మిల్క్‌డెయిరీ డైరెక్టర్ బాలీశ్వరరెడ్డి, ఆకుమళ్ల రహీం, నిమ్మకాయల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల బస్సు బోల్తా

- కుంభమేళాకు వెళ్లి తిరిగి అనంతపురం వెళ్తుండగా ప్రమాదం




క్షతగాత్రులను బయటకు తీస్తున్న గ్రామస్థులు

తుగ్గలి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కుంభమేళాకు వెళ్లి తిరుగు ప్రయాణంలో మరో మూడు గంటల్లో గమ్యానికి చేరే సమయంలో భక్తుల బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా, 12 మంది స్వల్పంగా గాయపడ్డారు. శుక్రవారం మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని స్వగ్రామాలకు బయలేదురారు. అయితే జొన్నగిరి-మదనంతపురం క్రాస్ మధ్య మలుపు వద్ద బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. అనంపురం జిల్లా నుంచి 43 మంది భక్తులు ఈ నెల 6వ తేదీన కుంభమేళాకు తీసుకెళ్లారు. తీర్థయాత్రలు చేసుకుని మరో మూడు గంటల్లో గమ్యస్థానాలకు చేరే సమయంలో ప్రమాదం జరిగింది. బస్సు బోల్తా పడటంతో ప్రయాణికులు అందరూ ఇరుక్కుపోవడంతో జొన్నగిరి గ్రామస్థులు, టీడీపీ నాయకులు, పోలీసులు క్షతగాత్రులను బస్సులో నుంచి బయటకు తీసి గాయపడిన వారిని గుత్తి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గాయపడిన వారిలో తులసి, పూర్ణిమ, డ్రైవర్ వినోద్ పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం వైద్యశాలకు తరలించారు. పుష్పావతి, లక్ష్మయ్య, మహాలక్ష్మి, రమేష్ నాయక్, ప్రమీళ, ఉమాదేవి, స్కంద, వెంకటరమణప్ప, నాగరాజులకు స్వల్పగాయాలు కావడంతో గుత్తి వైద్యశాలలో చికిత్సలు అందించారు. క్షతగాత్రుల్లో బెంగళూరు, బాగేపల్లి, దొడ్డబల్లాపూర్, అనంతపురం, గౌరిబిందనూరు తదితర గ్రామాలకు చెందిన వారు ఉన్నారు. పత్తికొండ ఆర్డీవో డా.భరత్ కుమార్ నాయక్, పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్‌గౌడు, తహసీల్దార్ రమాదేవి, జొన్నగిరి ఎస్ఐ జయశేఖర్ సంఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రులను వైద్యశాలకు తరలించి మిగిలిన వారిని ప్రత్యేక వాహనాల్లో వారి సొంత గ్రామాలకు తరలించారు. జియో మైసూరు కంపెనీ వారు క్రేన్ పంపించడంతో బస్సును పక్కకు తొలగించారు. క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు జొన్నగిరి పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్ కేసులో నిందితుడి అరెస్టు

ఆదోని, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సంచలనం రేపిన రూ.కోట్ల విలువ చేసే భూమి అక్రమ రిజిస్ట్రేషన్ కేసులో ప్రధాన నింధితుడు చాకలి ఈరన్నను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ సూర్య మోహన్ రావు వివరాలు వెల్లడించారు. మండిగిరి పంచాయతీ పరిధిలోని యగ్గటి ఈశ్వరప్పకు చెందిన సర్వే నెం. 321/ఏలోని 6.51 ఎకరాల పొలాన్ని నంద్యాలకు చెందిన ఆముదాల భాస్కర్ తాను ఈశ్వరప్ప కొడుకు అని నకిలీ డెత్ సర్టిఫికెట్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ సృష్టించి 2024 డిసెంబర్ 31న రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. విషయం తెలుసుకున్న అసలైన యజమాని ఈశ్వరప్ప జనవరి 4న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మోసంలో 10మందికి పైగా కేసు నమోదు చేశారు. ఇప్పటికే 8 మందిని అరెస్టు చేయగా, ప్రధాన నింధితుడు గోనెగండ్ల మండలం పెద్దమర్రివీడు గ్రామానికిచెందిన చాకలి ఈరన్న పరారీలో ఉన్నారు. శుక్రవారం ఆస్పరి బైపాస్ వద్ద ఉన్నట్లు సమాచారం మేరకు అదుపులోకి తీసుకునానరు. నిందితుడి నుంచి నకిలీ డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. సబ్ రిజిస్ట్రార్ హాజీమియ్యా ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారు.



నిందితుడిని చూపుతున్న సీఐ

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సస్పెన్షన్

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో పారిశుధ్య విభాగంలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి టి.నరసింహులును సస్పెండ్ చేస్తూ కమిషనర్ ఎస్. రవీంద్రబాబు ఉత్తర్వులు జారీ చేశారు. 8వ డివిజన్‌లో పని చేస్తున్న ఉద్యోగి 8వ వార్డులో పుష్‌గాట్స్‌ను గుజురి దుకాణంలో అమ్మివేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఆయనను ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నరసింహులతో పాటు అనధికార వ్యక్తి కూడ ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు.

టమోటా రైతులను ఆదుకుంటాం

- గిట్టుబాటు ధర అందిస్తామన్న జాయింట్ కలెక్టర్ నవ్య
- పత్తికొండ మార్కెట్ యార్డులో కొనుగోళ్లు తిరిగి ప్రారంభం



పత్తికొండ మార్కెట్‌యార్డ్‌లో రైతులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవ్య

పత్తికొండ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): టమోటా రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకుంటామని జాయింట్ కలెక్టర్ నవ్య అన్నారు. శుక్రవారం ట్రైనీ కలెక్టర్ కళ్యాణితో కలసి పత్తికొండ మార్కెట్ యార్డులో టమోటా విక్రయాలను పరిశీలించారు. అంనతరం విలేకర్లతో మాట్లాడు తూ జిల్లా వ్యాప్తంగా టమోటా దిగుబడులు వస్తున్నాయని, అయితే మార్కెట్ యార్డులలో కొనుగోలు కేంద్రాలు నిలిచిపోవడంతో రైతులు దళారులకు తక్కువ ధరకు పంటను అమ్ముకుని నష్టపోతున్నరన్నారు. దీనికి తోడు ఇతర రాష్ట్రాల నుండి నాణ్యత ఎక్కువ ఉన్న టమోటా దిగుబ డులు పెరగడంతో సాధారణ నాణ్యత కలిగిన స్థానిక పంటను కొనుగోలు చేయడానికి వ్యాపా రులు ఆసక్తి చూపడం లేదన్నారు. దీంతో టమోటా రైతు లకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభు త్వం సిద్ధమైందన్నారు. నో లాస్ నో ప్రాఫిట్ కింద జిల్లావ్యాప్తంగా ఉన్న మార్కెట్ యార్డ్‌ల ద్వారా టమోటాను మార్కెటింగ్ శాఖ కొని రైతుబజార్లకు తరలిస్తుందన్నారు. కొనుగోలు చేసిన పంటకు మార్కెటింగ్ శాఖ వెంటనే సొమ్ము చెల్లిస్తుందని తెలిపారు. పత్తకొండ మార్కెట్ యార్డ్‌లో శుక్రవారం 2 టన్నుల మేర టమోటా పంటను కొన్నామని అన్నారు. రైతుకు కిలో రూ10 గిట్టుబాటు ధరను అందిస్తున్నామని అన్నారు. నాణ్యత తగ్గితే గిట్టుబాటు ధర తగ్గుతుందని అన్నారు. శనివారం నుంచి పత్తికొండ మార్కెట్ యార్డ్‌లో పూర్తిస్థాయిలో టమోటా కొనుగోళ్లు ప్రారంభం అవుతాయని అన్నారు. మార్కెటింగ్ ఏడీఎం నారాయణమూర్తి, ఇన్‌చార్జి ఆర్డీవో వెంకటేశు, హార్టీకల్చర్ ఏడీ దస్తగిరి, మార్కెట్ సెక్రటరీ కార్నలీస్ ఉన్నారు.

కిలో రూ.10లకి కొన్నారు



బోరు కింద ఎకరాలో టమోటా సాగు చేశా. పత్తికొండ మార్కెట్ బంద్ కావడంతో వ్యాపారులకు పంట అమ్ముకుంటు న్నాను. కిలో రూ.5లరే మించి వ్యాపారులు కొనలేదు. ఈరోజు 24 బాక్స్‌లు తీసుకురాగా కిలో రూ.10ల చొప్పున మార్కెటింగ్ అధికారులు కొని వెంటనే డబ్బులు ఇచ్చారు. **- లక్ష్మన్న, పెరవలి**

భక్తులకు మెరుగైన సౌకర్యాలు



అన్నదానసత్రంలో భోజనం చేస్తున్న మల్లెల రాజశేఖర్

- టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్
- కాల్వబుగ్గలో శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

ఓర్వకల్లు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కాల్వబుగ్గ రామేశ్వరస్వామి శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ వెల్లడించారు. ఈ నెల 25 నుంచి మార్చి 2వ తేదీ వరకు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ కాల్వబుగ్గ క్షేత్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. రెండు కోనేరులను బోరు నీటితో నింపామన్నారు. అలాగే మహిళల కోసం ప్రత్యేకంగా స్నానపు ఘట్టాలు ఏర్పాటు చేశామన్నారు. స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బం దులు లేకుండా క్యూలైన్లు ఎండలను దృష్టిలో పెట్టుకుని ఆలయ ప్రాంగణంతో టెంట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో మద్దిలేటి, ఫెస్టివల్ కమిటీ సభ్యులు కాటినేని నారాయణ, కాకి దేవేంద్ర, భక్తులు కేవీ మధు, సుధాకర్, రాము, ఆలయ ప్రధాన అర్చకులు కల్లె లక్ష్మినారా యణ శర్మ, కల్లె లక్ష్మినర సింహశర్మ, బజారు, గువ్వ రవికుమార్, వేణు, గొల్ల నాగరాజు, మాజీ ఎంపీటీసీ నాగరాజు ఉన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన డిప్యూటీ కమిషనర్

కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఏర్పాట్లను దేవదాయ ఉప కమిషనర్ పట్టెం గురుప్రసాద్ పర్యవేక్షించారు. ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న పనులను, పెద్ద కోనేరు, చిన్నకోనేరు, అన్నదాన సత్రాన్ని పరిశీలించి అధికారులకు, ఉత్సవ కమిటీ సభ్యులకు పలు సూచనలు, సలహాలు చేశారు. అందరూ సమన్వయంతో పని చేసి భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని ఈఓ మద్దిలేటిని ఆదేశించారు.

కుంభమేళాకు వెళ్లి మంత్రాలయం వాసి మృతి

- నర్మదా నది వద్ద మృతదేహం.. అక్కడే అంత్యక్రియలు



శంకర్ స్వామి(ఫైల్)

మంత్రాలయం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాకు వెళ్లిన మంత్రాలయం వాసి శంకర స్వామి (52) మృతి చెందారు. బంధువులు, తోటి యాత్రికులు తెలిపిన వివరాలివీ.. ఈ నెల 12న పెద్దకడుబూరు మండలం బసలదొడ్డి గ్రామానికి చెందిన కొంత మంది, మంత్రాల యానికి చెందిన 8 మంది బస్సును అద్దెకు తీసుకుని కుంభమేళాకు బయలుదేరారు. తీర్థయాత్రలకు వెళ్లే మార్గాల్లో ఆయా పుణ్యక్షేత్రాలను దర్శించుకుంటూ వెళ్లారు. ఈ నెల 16న ఓంకారేశ్వరంలోని నర్మద నది వద్ద ఉదయం కాలకృత్యాలను తీర్చుకునేం దుకు బస్సును నిలిపారు. కాలకృత్యాల కోసం వెళ్లిన శంకరస్వామి అదృశ్యమ య్యారు. బంధువులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి గాలింపు చేపట్టారు. నర్మదా నదిలో శవమై కనిపించినట్లు గురువారం పోలీసులు కనుగొని బంధువులకు సమాచారం ఇచ్చారు. అనంతరం అక్కడే అంత్యక్రియలు చేశారు. శంకర్ స్వామి అవివాహితుడు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. **మేనేజర్ - ఏడివిటి**

బాలురు అదృశ్యం

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పట్టణం లోని పొన్నాపురం కాలనీకి చెందిన ఇద్దరు పిల్లలు తప్పిపో యినట్లు తాలుకా అర్బన్ సీఐ ఈశ్వరయ్య శుక్రవారం తెలిపారు. ఈ నెల 20వ తేదీన పొన్నాపురం కాలనీలోని వారి ఇళ్లనుంచి ఇద్దరు బాలురు మధ్యాహ్నం 3గంటలకు బయటకు వెళ్తున్నామని చెప్పి తిరిగి రాకపోవడంతో పిల్లల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారని చెప్పారు. పొన్నాపురం కాలనీకి చెందిన కాకి సురేంద్ర కుమారుడు కాకి నరేష్ (12) అనే బాలుడు, షేక్ హరూన్ బాషా కుమారుడు షేక్ జహీర్ మౌలాలి (12) అనే ఇద్దరు బాలలు వారి వారి ఇళ్ల నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇళ్లకు చేరలేదని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి గాలిస్తున్నామని సీఐ తెలిపారు.



షేక్ జహీర్ మౌలాలి, కాకి నరేష్

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయిని

నంద్యాల హాస్పిటల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని ఓ ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయిని విద్యార్థి షేక్ మహమ్మద్ అజిజుల్లాను చితకబాదిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. దీంతో ఆ విద్యార్థి తొడ ఎర్రగా కందిపోయింది. 2వ తరగతి చదువుతున్న విద్యార్థి షేక్ మహమ్మద్ అజిజుల్లా చదువులో వెనుకబడి ఉన్నాడని ఉపాధ్యాయిని కొట్టినట్లు తల్లిదండ్రులు ఆరోపించారు. డీఈవోకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. విద్యాశాఖధి కారులు విచారణ చేసి, చర్యలు తీసుకోవాలని పీడీఎస్ యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎండీ రఫి డిమాండ్ చేశారు. పాఠశాలలో జరుగుతున్న సంఘటనపై అలసత్వం వహిస్తే తల్లిదండ్రులతో పాటు విద్యార్థి సంఘాలను కలుపుకొని ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



కందిన విద్యార్థి తొడ

జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు మూసెయ్యాలి

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 21: ఈ నెల 23 జరగనున్న గ్రూప్-2 సర్వీసెస్ మెయిన్(అబ్జెక్టివ్ టైప్)పరీక్షల నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద జిరాక్స్ ఇంటర్నెట్ సెంటర్లు బంద్ చేయాలని కార్మిక శాఖ ఉప కమిషనర్ కే. వెంకటేశ్వర్లు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఏపీపీఎస్సీ సెక్రటరీ విజయవాడ ఉత్తర్వుల మేరకు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా ఆదేశాల మేరకు ఉదయం 9.00 నుండి సాయంత్రం 5.30 గంటల వరకు జిల్లాలోని పరీక్షా కేంద్రాల వద్ద జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లను యజమానులు మూసి వేయాలని లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుత్ సమస్యలు రాకుండా చర్యలు

- ఏపీఈఆర్సీ చైర్మన్ ఠాకూర్ సింగ్



పద్మావతినగర్ ఇండోర్ సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న చైర్మన్

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రాబోయే వేసవి కాలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగుకుండా ఉండేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్సీ) చైర్మన్ ఠాకూర్ సింగ్ వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం నంద్యాలలోని విద్యుత్ సబ్‌స్టేషన్, పద్మావతి నగర్‌లోని ఇండోర్ సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. విద్యుత్ అధికారులకు పలు సూచనలు చేశారు. వీటిలో నంద్యాల బొమ్మలసత్రం 220/132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో గల పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం 100 ఎంవీఏ నుంచి 160 ఎంవీఏకు పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ముత్యాలపాడు, శిరివెళ్లలో 220/132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లను నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. నంద్యాల డివిజన్ పరిధిలో అధికలోడు గల 33 కేవీ ఫీడర్ నుంచి తక్కువ లోడ్‌గల 33 కేవీ ఫీడర్‌కు డైవర్షన్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 33/11 కేవీ పద్మావతీనగర్ ఇండోర్ సబ్‌స్టేషన్‌కు 33 కేవీ ప్రత్యామ్నాయ సరఫరా కోసం ఎస్పీవై ఆగ్రో ఫీడర్ నుంచి సుమారు 6 కిలోమీటర్ల మేర లైన్ ఏర్పాటు చేయాలన్నారు. ఎస్ఈలు మధుసూదన్‌రావు, బాబు రాజేంద్ర, నంద్యాల ఆపరేషన్స్ ఈఈ శ్రీనివాసులు రెడ్డి, ట్రాన్స్‌కో ఈఈ ప్రభాకర్, నంద్యాల టౌన్ డీఈఈ రమేష్‌కుమార్, ఏఈ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

మనిషిని మింగిన మిషన్..

- పొట్టు మిషన్‌లో పడిపోయిన వ్యక్తి

నాన్నా..నాన్నా..ఎక్కడున్నావ్... అమ్మా..నాన్న మిషన్‌లో ఇరుక్కున్నాడే... మాట్లాడడం లేదు... అంటూ అన్నం తింటున్న తల్లి వద్దకు ఆ బిడ్డ పరుగులు తీశాడు. కొడుకు ఏడుపు చూసి ఆమె పరుగున వెళ్లి చూసింది. అప్పటికే ఆయన మృతి చెందాడు. వివరాల్లోకెళ్తే...



మాల రాఘవేంద్ర(ఫైల్)

ఆదోని రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఆదోని మండలం కడితోట గ్రామానికి చెందిన మాల రాఘవేంద్ర(45), లక్ష్మి దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు, కొడుకు ఉన్నారు. గత 10సంవత్సరాలుగా ఆ దంపతులు ఆదోని - శిరుగుప్ప ప్రధాన రహదారిలోని మహాగౌరి ఉద్యోగ్ బయో మాస్ బ్రికెట్స్ ఫ్యాక్టరీలో కార్మికులుగా పనిచేస్తున్నారు. శుక్రవారం కొడుకు వీరేష్‌తో కలిసి ఆ దంపతులు పనికొచ్చారు. మధ్యాహ్నం 2గంటల సమయంలో అందరూ ఒకచోట కూర్చొని భోజనం చేశారు. ముందుగా భోజనం ముగించుకొన్న రాఘవేంద్ర ఫ్యాక్టరీలోకి వెళ్ళి మిషన్లు ప్రారంభించాడు. అందులోకి బుడ్డల పొట్టును వేస్తున్న క్రమంలో ఒక్కసారిగా మిషన్‌లోకి పడిపోయాడు. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో రాఘవేంద్ర మృతి చెందాడు. రాఘవేంద్రతోపాటు లోపలి కెళ్లిన కొడుకు వీరేష్ మిషన్‌లో తండ్రి పడిపోయి తీవ్రంగా గాయపడి చనిపోవడం చూశాడు. కేకలు వేస్తూ, బయటకు పరుగులు తీశాడు. ఇంతలో భార్య లక్ష్మితోపాటు ఇతర కూలీలు లోపల కెళ్ళి చూశారు. రాఘవేంద్ర శవాన్ని పట్టుకొని ఆ ఇల్లాలు కన్నీటి పర్యంతమైంది. ఇస్వీ ఎస్.ఐ, నాగేంద్ర, ఫ్యాక్టరీ యజమాని మల్లికార్జున చేరుకొని శవాన్ని బయటకు తీశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ తెలిపారు.



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఫ్యాక్టరీ యజమానుల నిర్లక్ష్యంతోనే..

ఫ్యాక్టరీ యజమానుల నిర్లక్ష్యంతోనే రాఘవేంద్ర చనిపోయాడని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత పెద్ద ఫ్యాక్టరీలో కనీస జాగ్రత్తలు పాటించడం లేదని, గవిలాంటి ఈ భవనంలో పనిచేసే కార్మికుల ప్రాణాలను రక్షించడానికి ముందు జాగ్రత్తలు తీసుకోలేదని అన్నారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

మాతృభాష మాధుర్యాన్ని భావితరాలకు చాటిచెబుదాం

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మాతృభాషలోని మాధుర్యాన్ని భావితరాలకు చాటిచెబుదామని పలువురు వక్తలు పిలుపు నిచ్చారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం శుక్రవారం నగరంలోని వివిధ సంస్థల ప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. నగరంలో కొండా రెడ్డి బురుజు సమీపంలోని తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి వందన సమర్పణ చేశారు.

● **టీజీవీ కళాక్షేత్రంలో :** మాతృభాషను నేర్చుకుంటే ఇతర భాషలను సులువుగా నేర్చుకోవచ్చని, తల్లిదండ్రులు తమ పిల్లలను తొలుత తల్లి భాష పట్ల మమకారం పెరిగేలా చూడాలని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అన్నారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో శుక్రవారం సాయంత్రం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి వందన సమర్పణ చేశారు. ఈ సందర్భంగా పత్తి ఓబులయ్య మాట్లాడుతూ మాతృభాషను విస్మరిస్తే తల్లిని విస్మరించినట్లేనని అన్నారు. అనంతరం మాతృభాష పురోభివృద్ధికి కృషి చేస్తున్న సాహితీవేత్తలు కథా రచయిత ఎస్ఎండీ ఇనాయతుల్లా, గేయ రచయిత గద్వాల ఈరన్న, నరసం సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి దండెబోయిన పార్వతీదేవి, కవయిత్రి కర్నాటి చంద్రమౌళినిలకు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో గజల్ గాయకుడు మహమ్మద్ మియా, కళాక్షేత్రం సభ్యులు సీవీ రెడ్డి, యాగంటీశ్వరప్ప, ఎర్రమ పాండురంగయ్య, లక్ష్మీకాంతారావు, వన్నెం బలరాం, ఎస్డీ క్రిష్టఫర్ తదితరులు పాల్గొన్నారు.

● **పద్మశ్రీ ఘంటసాల గానకళా సమితి ఆధ్వర్యంలో :** అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగుతల్లి విగ్రహానికి పూలదండలు వేశారు. వైద్య నిపుణులు డాక్టర్ డబ్ల్యూ సీతారాం, బి.శంకరశర్మ మాట్లాడుతూ పాకిస్తాన్‌లోని బెంగాలీయులు తమ వంగభాషను అధికార భాషగా కోరుతూ చేపట్టిన ఉద్యమంలో ఎందరో ప్రాణాలు కోల్పోయారని, వారి ఆత్మత్యాగంతోనే బంగ్లాదేశ్ అనే దేశమే ఏర్పడిందని గుర్తు చేశారు. ఆ అమరవీరుల త్యాగాలకు గుర్తుగా ప్రపంచ దేశాల్లో నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం జరుపుతున్నారని చెప్పారు. గాడిచర్ల ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేసీ కల్కూర, తెలుగు కళా సమితి కార్యదర్శి మధురకవి ఎలమర్తి రమణ య్య, పద్మశ్రీ ఘంటసాల గానకళా సమితి అధ్యక్షుడు వాసుదేవమూర్తి, సభ్యులు రాఘవేంద్రప్రసాద్, జగన్నాథగుప్త, రాముడు, ఏవీ రెడ్డి పాల్గొన్నారు.

● **ప్రభుత్వ బీఎడ్ కళాశాలలో:** బెంగాలీయుల మాతృభాష ఉద్యమం గొప్ప స్ఫూర్తిదాయకమైందని ప్రభుత్వ ఉన్నత విద్య అధ్యయన సంస్థ (ప్రభుత్వ బీఎడ్ కళాశాల) ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదినారాయణ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా కళాశాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలుగుతల్లి చిత్రపటానికి పూలదండలు వేసి వందన సమర్పణ చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ గజల్ గాయకుడు మహమ్మద్ మియా మాట్లాడుతూ మాతృభాషలో కమ్మటి మాధుర్యం ఉందన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మధుసూదన్, తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి, అధ్యాపకులు కల్యాణ్‌కుమార్, నాగలక్ష్మి, వరదరాజు తదితరులు ప్రసంగించారు.

● తెలుగుదేశం పార్టీ జిల్లా సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో, జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం సహకారంతో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు పి.హనుమంతరావు చౌదరి మాట్లాడుతూ మాతృభాషను పరిరక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ సాంస్కృతిక విభాగం జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య చౌదరి, ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్ష్మీపద్మ చౌదరి, బైలుప్పల షఫీయుల్లా, విశ్రాంత తహసీల్దారు టి.నాగేశ్వరరావు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

● ప్రాథమిక తరగతులను మాతృభాషలో బోధించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని రోజా మహిళా ఐక్యసంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా, రోజావీధిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలుగుతల్లి చిత్రపటానికి పూలదండలు వేశారు. కార్యక్రమంలో బీవీఆర్ పుల్లారెడ్డి, నాగన్న, నాగరాజు, రాముడు, షాలేమియా, మాలిక్, మునీర్ బాషా, నాగప్ప, శేషమ్మ పాల్గొన్నారు.

కర్నూలు అర్బన్: క్లస్టర్ వర్శిటీ పరిదిలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సిల్వర్ జూబ్లీ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉపకులపతి డీవీఆర్ సాయి గోపాల్, ప్రిన్సిపల్ వీవీఎస్ కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు, బీఆర్ ప్రసాదరెడ్డి, అక్తర్‌భాను, నాగరాజు, శనాభాజ్ బేగం, నాగ సురేష్ పాల్గొన్నారు.

కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో.. అభ్యుదయ రచయితల సంఘం, కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. వైఎస్ ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి మాట్లాడుతూ అంతరించి పోతున్న మాతృభాషాలను బతికించుకోవాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తెలుగు విభాగం అధిపతి జీ ప్రమీల మాట్లాడుతూ ఎవరు ఎన్ని భాషలు నేర్చుకున్నప్పటికి మాతృభాషలో ప్రావీణ్యత లేకపోతే వారి విజ్ఞానం ఎవరికి ఉపయోగ పడదన్నారు. అభ్యుదయ రచయితల సంఘం గౌరవాధ్యక్షులు ఎం హరికిషన్ మాట్లాడుతూ మాతృభాషా దినోత్సవం, తెలంగాణ భాషా దినోత్సవం ఈ మూడింటి మధ్యగల తేడాలు, వాటి నేపథ్యాలను తెలియజేస్తూ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో రచయితల సంఘం నగర అధ్యక్షురాలు రాణి లీలావతి, జయసుశీల, మణికంఠ పాల్గొన్నారు.

కర్నూలు ఎడ్యుకేషన్: ఎస్‌ఏపీ క్యాంపులోని కట్టమంచి రామలింగారెడ్డి మున్సిపల్ హైస్కూల్‌లో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం వెంకటరెడ్డి మాట్లాడుతూ ఎందరో కవులు తెలుగు భాషకు వన్నె తెచ్చేలా ఎన్నో మధురకావ్యాలు రచించారని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహాలక్ష్మి, చంద్రకళాదేవి, మనోరంజిని, సుజాత, అల్లూరి సీతారామరాజు శతవర్ధంతి కమిటీ జిల్లా అధ్యక్షుడు రామశేషయ్య, కార్యదర్శి తేజోవతి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

గూడూరు: గూడూరు పట్టణంలోని జడ్పీ బాలురు పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం గూడూరులో ప్రధానోపాధ్యాయుడు డి సురేష్ బాబు అధ్యక్షతన పాఠశాల కమిటీ చైర్మన్ కర్ల ఆధ్వర్యంలో తెలుగు ఉపాధ్యాయులు ఎస్ రామకృష్ణ, శశికళ నిర్వహణలో భువన విజయం నాటక ప్రదర్శన ఏర్పాటు చేశారు. విద్యార్థులు నాటకంలో తమ నటనను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మండలంలోని ఓర్వకల్లు, నన్నూరు, హుశేనాపురం, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, శకునాల, సోమయాజులపల్లె తదితర గ్రామాల్లో శుక్రవారం జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తెలుగుబాషా గొప్పతనాన్ని ప్రధానోపాధ్యాయులు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం రామచంద్రరెడ్డి, ఉపాధ్యాయులు భాస్కర్, వరలక్ష్మి, నాగేంద్రమ్మ, శ్యామలమ్మ, చంద్రశేఖర్‌రాజు, ఆంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్యతో సత్కారం పొందిన సాహితీవేత్తలు



తెలుగుతల్లి విగ్రహం వద్ద వైద్య నిపుణులు డబ్ల్యూ సీతారాం, శంకరశర్మ, కేసీ కల్కూర తదితరులు



కేవీఆర్ కళాశాలలో..







మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు వెంకటరెడ్డి, ఓర్వకల్లు హైస్కూలులో.. గూడూరు జడ్పీ బాలుర పాఠశాలలో..

కొత్త కూలి రేట్ల జీవో విడుదల చేయాలి



ధర్నా చేస్తున్న కార్మికులు

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లయ్ హమాలీలకు కొత్త కూలి రేట్ల జీవోను విడుదల చేయాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభు త్వం విఫలమైందన్నారు సీఐటీయూ నగర కార్యదర్శి విజయ్, నాయకులు సోలోమన్ రాజు, శివ, వినయ్, ప్రకాష్ పాల్గొన్నారు.

గూడూరు: సివిల్ సప్లయ్ హమాలీలకు కొత్త కూలీ రేట్ల జీవోను విడుదల చేయాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జే మోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జే మోహన్ ఆధ్వర్యంలో ఎంఎల్ఎస్ పాయింట్ దగ్గర నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఎంఎల్ఎస్ పాయింట్ గోడౌన్ ఇన్‌చార్జికు జె మోహన్ వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ హమాలీ కార్మికులు మధు, రామాంజనేయులు, దానమన్న, రంగన్న, గోపి, మల్లికార్జున పాల్గొన్నారు.

పీ-4 సర్వేకు ప్రజలు సహకరించాలి

ఓర్వకల్లు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ-4 సర్వేకు ప్రజలంతా సహకరించాలని ముఖ్య ప్రణాళిక అధికారి హిమప్రభాకర్‌రాజు అన్నారు. శుక్రవారం మండలంలోని కాల్వ గ్రామంలో సర్వేను ఆయన పరిశీలించారు. ఉయ్యాలవాడ గ్రామంలో ఎంపీడీవో శ్రీనివాసులు పరిశీలించారు.

కర్నూలు న్యూసిటీ: పబ్లిక్-ప్రైవేట్- పీపుల్స్- పాట్నర్‌షిప్ (పీ4) సర్వేను నగరంలో పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు శుక్రవారం తెలిపారు. నగరంలోని 133 సచివాలయ పరిదిలో 82,628 కుటుంబాలను సర్వే చేయాల్సి ఉండగా సాయంత్రానికి 14.69 శాతం 12,142 కుటుంబాల సర్వే పూర్తి చేశారన్నారు. గత ఏడాది ప్రభుత్వం నుంచి పొందిన సంక్షేమ పథకాలు, తదితర వివరాలను సేకరించి పీ4 యాప్‌లో నమోదు చేస్తారన్నారు. వాస్తవ సమాచారాన్నే సచివాలయ సిబ్బందికి ప్రజలు అందించాలని ఆయన కోరారు.

హామీలను నెరవేర్చాలి: ఏఐటీయూసీ

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్ర బాబు ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన నగర సమితి సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఆటో కార్మికులకు వాహన మిత్ర కింద రూ.15 వేలకు పెంచి డబ్బులు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో నగర అధ్యక్షుడు వెంకటేష్, కార్యదర్శి జి.చంద్రశేఖర్, ఉప ప్రధాన కార్య దర్శి రామాంజనేయులు, ఆర్.కృష్ణారెడ్డి, ఈశ్వర్ పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సుల సమస్యలను పరిష్కరించాలి

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న స్టాఫ్ నర్సుల సమస్యలను పరిష్కరించాలని కర్నూలు డీఎంహెచ్‌వో పి.శాంతికళకు ఏపీ గవర్నమెంటు నర్సెస్ అసోసియేషన్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.లీలావతి, సి.బంగారి మాట్లాడుతూ పీహెచ్‌సీలో పని చేస్తున్న స్టాఫ్ నర్సులకు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం వారంతపు సెలవులు ఇవ్వాలని కోరారు. అలాగే మహిళ స్టాఫ్ నర్సులకు ఐదు రోజుల క్యాజువల్ లీవ్‌లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి.శాంతిభవాని, జిల్లా కోశాధికారి ఎన్.లక్ష్మీనరసమ్మ, ఈసీ సభ్యులు శాంతిలత, సోమేశ్వరి, ఉమారాణి, కృష్ణవేణి పాల్గొన్నారు.

కర్నూలు సీఐడీ అడిషనల్ ఎస్పీగా పూజిత

కర్నూలు క్రైం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కర్నూలు సీఐడీ ఆర్వోగా అడిషినల్ ఎస్పీ పూజితను నియమిస్తూ రాష్ట్ర డీజీపీ హరిష్ కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు సీఐడీ ఆర్వోగా ఉన్న పూజితను కర్నూలుకు బదిలీ చేసింది. ప్రస్తుతం కర్నూలు సీఐడీ ఆర్వోగా దైవప్రసాద్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.

12 మందికి జరిమానా

కర్నూలు క్రైం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓపెన్ డ్రింకింగ్, డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 12 మందికి కోర్టు జరిమానా విధించింది. మద్యం తాగి వాహనాలు నడుపుతూ ఒకరు పట్టుబడగా.. కోర్టు రూ.3వేలు జరిమానా విధించింది అలాగే 11 మందిపై ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేయగా.. వీరికి ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున జరిమానా విధించింది. అలాగే రెండు రోజుల క్రితం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 20 మందిని కోర్టులో హాజరు పరచగా.. కోర్టు వారికి రూ.70వేలు జరిమానా విధించింది.

బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): బ్యాంకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంకు యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) జిల్లా కన్వీనర్ ఈ. నాగరాజు డిమాండ్ చేశారు. వచ్చే నెల మార్చి 24, 25 తేదీల్లో దేశ వ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు తలపెట్టిన రెండు రోజుల సమ్మెకు ముందస్తు నిరసన కార్యక్రమంలో భాగంగా, శుక్రవారం సాయంత్రం నగరంలోని గాయత్రి ఎస్టేట్‌లోగల యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, బుధవారపేట శాఖ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఈ.నాగరాజు మాట్లాడుతూ బ్యాంకుల్లో గత పదేళ్లుగా ఏర్పడిన రెండు లక్షల ఉద్యోగ ఖాళీలను తక్షణం భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీజీబీ యూనియన్ నాయకులు హనుమంతరెడ్డి, విశ్రాంత యూనియన్ నాయకుడు ప్రభాకర్, ఏబీఈఏ నాయకులు అనిల్ రెడ్డి, ఎల్లయ్య, వాసుదేవరెడ్డి, పద్మావతి, ఏఐబీఓసీ నాయకులు జియా ఉర్ రహమాన్, రాజు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఏపీ ఫైబర్ నెట్..

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఫైబర్ నెట్ సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఫైబర్ కేబుల్ నెట్ ఆపరేటర్స్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఏపీ ఫైబర్ నెట్ సమస్యలపై కలెక్టరేట్ ముందు జిల్లా ఫైబర్ కేబుల్ నెట్ ఆపరేటర్లు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా కేబుల్ నెట్ ఆపరేటర్లు రజని కుమార్ సింగ్, మధుమోహన్ మాట్లాడారు. కార్యక్రమంలో ఫైబర్ కేబుల్ నెట్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

అంబులెన్స్‌ను ప్రారంభించిన ఎస్పీ



అంబులెన్స్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జోహరాపురంలో ఉన్న కిమ్స్ కడల్స్ ఆసుపత్రిలో నియోనేటల్ అంబులెన్స్‌ను ఎస్పీ విక్రాంత్ పాటిల్, పీడియాట్రిక్ వైద్య నిపుణుడు డాక్టర్ జి.సుధాకర్, డాక్టర్లు రఫీక్, గోవర్దన్ రెడ్డి, హెచ్ఏ నవీద్‌లు ప్రారంభించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పుట్టిన పిల్లలకు తీవ్ర సమస్యలుంటే వారిని ఇంక్యుబేట ర్‌లో పెట్టడం, అవసరమైతే మరింత అత్యాధునిక వైద్య సేవలు అందిస్తూ సురక్షితంగా ఆసుపత్రులకు తరలించడం దీని వల్ల సాధ్యమవుతుందన్నారు. కిమ్స్ ఆసుపత్రి ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ సునీల్ సేపూరి మాట్లాడుతూ రాయలసీమలో మొట్టమొదటి సారిగా నియోనేటల్ అంబులెన్స్‌ను కిమ్స్ ఆసుపత్రిలో అందుబాటులోకి తీసుకుని వచ్చామన్నారు. కార్యక్రమంలో కిమ్స్ ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం.. కేసు నమోదు

ఓర్వకల్లు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని నన్నూరు గ్రామానికి చెందిన హరికుమార్ అదృశ్యం కావడంతో శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సునీల్ కుమార్ తెలిపారు. హరికుమార్ తండ్రి ఆంజనేయులు ఆస్తి విషయంలో మాటా మాటా అనుకున్నారని, ఈ నెల 15న తన భార్య, ఇద్దరం పనికి వెళ్లామని, సాయంత్రం ఇంటికి వచ్చి చూస్తే హరికుమార్ ఇంట్లో లేడని, ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడని, బంధువులు తదితర చోట్ల వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదశ్యం కేసు నమోదు చేశామని, ఆచూకీ తెలిసిన వారు ఎస్ఐ, కర్నూలు రూరల్ సీఐ 9121101067, 9121101065 నెంబ ర్లకు ఫోన్ చేయాలని వారు కోరారు.

27న కాల్వబుగ్గలో అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలు

ఓర్వకల్లు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 27న కాల్వబుగ్గ క్షేత్రంలో నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో అంతర్రాష్ట్ర కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే జట్లు ప్రవేశ రుసుం రూ.500 చెల్లించాలన్నారు. విజేతలకు నగదును బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివరాల కోసం 79817 96410, 90146 09220 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

చెత్త సేకరణ కేంద్రాల పరిశీలన

సి.బెళగల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కంబందహాల్, పోలకల్లు గ్రామాల్లోని చెత్తసేకరణ కేంద్రాలను ఈవోఆర్డీ ఈశ్వరస్వామి శుక్రవారం పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

కర్నూలు రూరల్ ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కోడుమూరు మండలం కళ్లపారి గ్రామానికి చెందిన యాగంటి ఉశేన్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అందజేశారు. యాగంటి ఉశేన్ గత కొన్ని రోజులుగా దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతు న్నారు. ఆసుపత్రిలో చికిత్సకు అవసరమయ్యే డబ్బులు లేకపోడంతో ఎమ్మెల్యేని కలిశారు. ఆయన వెంటనే స్పందించి సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.లక్ష దాకా మంజూరు చేయించారు. ప్రభుత్వం ద్వారా మంజూరైన ఆచెక్కును శుక్రవారం పసుపుల గ్రామంలో తన నివాసంలో యాగంటి ఉశేన్‌కు అందజేశారు.

కోల్స్ తెలుగు బాప్టిస్ట్ చర్చి వార్షికోత్సవం

కల్లూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): 36వ వార్డు రాజీవ్ గృహకల్పలోని కోల్స్ తెలుగు బాప్టిస్ట్ చర్చి 10వ వార్షికోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత హాజరై ప్రసంగించారు. 36వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి రెడ్డిగారి తిరుమలేశ్వరరెడ్డి, తెలుగు మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ, చర్చి పెద్ద యోహాన్ పాల్గొన్నారు.

న్యాయవాద సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న సీనియర్ న్యాయవాది వై. జయరాజు

కర్నూలు లీగల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతిపా దించిన న్యాయవాద సవరణ 2025 బిల్లును వెంటను ఉపసంహరించు కోవాలని సీనియర్ న్యాయవాది, నేషనల్ లాయర్స్ ఫోరం అధ్యక్షుడు వై.జయరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయం వద్ద జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. న్యాయవాద వృత్తి, వాటి ప్రాతినిధ్య చట్టబద్ధమైన సంస్థలు అయిన బార్ కౌన్సిళ్ల స్వయం ప్రతిపత్తిని ఈ బిల్లు కాలరాసేదిలా ఉందని ఆయన విమర్శించారు. ప్రస్తుతం కేంద్ర సంస్థలు ప్రభుత్వం చేతిలో కీలుబొ మ్మలుగా మారాయని, ఈ సవరణలో న్యాయవాదులు, బార్ కౌన్సిళ్లు కూడా ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మలుగా మారుతారన్నారు. కార్యక్ర మంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్, ఉపాధ్యక్షుడు నిత్యజీవరాజు, న్యాయవాదులు మాసిపోగు సుబ్బయ్య, మహేష్, చంద్రుడు, రవిరాజు పాల్గొన్నారు.

● **కోర్టు విధులను బహిష్కరించిన న్యాయవాదులు:** కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న న్యాయవాద సవరణ బిల్లుకు వ్యతిరేకంగా న్యాయవా దులు శుక్రవారం తమ విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు నాగప్ప, ఆర్.నరసింహ, ఏ.ప్రభాకర్ రెడ్డి, నాగేంద్ర యాదవ్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు: ఎమ్మెల్యే



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు పెడుతుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. శుక్రవారం నగర మేయర్ బీవై.రామయ్య, కమిషనర్ రవీంద్రబాబుతో కలిసి ఎమ్మెల్యే 19, 35, 36, 41 వార్డుల్లో రూ.92.38 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. నగరంలోని 19వ వార్డు లక్ష్మీటౌన్‌షిప్‌లో రూ.50లక్షలతో డ్రైనేజీ కాల్వల నిర్మాణం, రామప్రియనగర్‌లో రూ.5లక్షలతో మున్సిపల్‌పార్క్ ప్రీక్యాస్ట్ నిర్మాణం, వెంటా ద్రినగర్‌లో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ కల్వర్టుల నిర్మాణాలకు ఎమ్మెల్యే గౌరు చరిత భూమి పూజ చేశారు. 35, 36, 41వ వార్డుల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. కార్యక్రమంలో తెలుగు మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ, కర్నూలు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, గంగాధర్‌గౌడ్, జనార్ధన్ ఆచారి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి : డీపీవో

కోడుమూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి సేకరించిన చెత్తతో సంపద సృష్టించాలని డీపీవో భాస్కర్ అన్నారు. స్థానిక చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో సంపద తయారి విధానంపై శుక్రవారం శిక్షణ తరగతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ మండలాల నుంచి ఒకరి చొప్పున పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. జడ్పీ సీఈవో నాసరరెడ్డి, ఈపీఆర్‌సీ డీసీ మంజూలవాణి పాల్గొన్నారు.

జి.పుల్లారెడ్డి సేవలు ఆదర్శప్రాయం

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): జి.పుల్లారెడ్డి స్వీట్స్ వ్యవస్థాపకుడు దివంగత గుణ్ణంపల్లి పుల్లారెడ్డి చేపట్టిన సామాజిక సేవలు అందరికీ ఆదర్శప్రాయమని వీహెచ్‌పీ కేంద్రీయ ఉపాధ్యక్షుడు గోకరాజు గంగరాజు కొనియాడారు. శుక్రవారం నగర శివారు జి. పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల వెనుక జి. పుల్లారెడ్డి స్థాపించిన విజ్ఞాన పీఠాన్ని ఆయన సందర్శించారు. గోకరాజు గంగరాజు మాట్లాడుతూ సేవాహీ పరమోధర్మః అన్న ఆరోక్తికి అనుగుణంగా దివంగత జి. పుల్లారెడ్డి 1971లో ఈ పీఠాన్ని ప్రారంభించడం ఆయన సేవాస్ఫూర్తికి నిదర్శనమని చెప్పారు. వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా గోకరాజు గంగరాజును వీహెచ్‌పీ అంతర్జాతీయ మాజీ అధ్యక్షుడు, పుల్లారెడ్డి తనయుడు జి.సుబ్బారెడ్డి, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో విజ్ఞానపీఠం ప్రధానాచార్యులు మాళిగి వ్యాసరాజ్, ఉపాధ్యక్షుడు ఎం. విష్ణువర్ధన్‌రెడ్డి, బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ సందీప్, వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి మాళిగి భానుప్రకాశ్, విజ్ఞానపీఠం పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రాపంచిక దృక్పథం ఉండాలి: సీపీఎం

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టులంతా ప్రాపంచిక దృక్పథం ఉండాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు కే.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఇందిరాగాంధీ నగర్‌లోని సుందరయ్య భవన్‌లో న్యూసిటీ నగర కార్యదర్శి టి.రాముడు అధ్యక్షతన జరిగిన రెడ్ బుక్ డే సందర్భంగా 'రాజ్యం-విప్లవం' అనే అంశంపై బహిరంగ అధ్యయనం నిర్వహించారు. కె.అరుణ, సి.గురుశేఖర్, శంకర్ పాల్గొన్నారు.

● కమ్యూనిస్టు సాహిత్యానికి ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పెరుగుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ అన్నారు. పాతబస్తీ హరికిషన్ సింగ్ సుర్జీత్ భవన్‌లో నగర కార్యదర్శి రాజశేఖర్ అధ్యక్షతన రెడ్‌బుక్ డేను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎండీ షరీఫ్, అబ్దుల్‌దేశాయ్, రామక్రిష్ణ పాల్గొన్నారు.

యూనివర్సిటీకి బడ్జెట్ కేటాయించాలి

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉర్దూ యూనివర్సిటీకి రూ.32 కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్య దర్శి ఎస్.సాబీర్‌బాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శుక్రవారం డీఆర్వో కార్యాలయంలోని డీఆర్వో వెంకట నారాయణమ్మకు వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా ఎస్.సాబీర్‌బాషా మాట్లాడుతూ క్లస్టర్ యూనివర్సిటీకి అనుబం ధమైన ఫర్‌మెన్ డిగ్రీ కళాశాలలో ఉర్దూ యూనివర్సిటీకి భవనాలు కేటా యించాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వు లు చేసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు అభిరామ్, నాయకులు అఖిల్, చరణ్, ఈశ్వర్, రంగస్వామి పాల్గొన్నారు.

టౌన్ మోడల్ జూనియర్ కాలేజీ వార్షికోత్సవం

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో శుక్రవారం వార్షికోత్సవం, వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుంకన్న మాట్లాడుతూ ఈ కళాశాల 1971లో స్థాపించినప్పటి నుంచి ఎంతో మంది వైద్యులను, డాక్టర్లను శాస్త్రవేత్తలను తీర్చిదిద్దిందని అన్నారు. రిటైర్డు ప్రిన్సిపాల్ తిమ్మయ్య, కళాశాల డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత లక్ష్యాలను అధిరోహించవచ్చని అన్నారు. డీవీఈవో పరమేశ్వరరెడ్డి, ఆర్ఐవో గురువయ్యశెట్టి మాట్లాడుతూ విద్యార్థులు పరీక్ష కాలాన్ని దృష్టిలో పెట్టుకుని సమయాన్ని వృథా చేయకుండా నిరసంతర సాధన చేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. డీఎస్పీ మహబూబ్ బాషా మాట్లాడుతూ లక్ష్య సాధన వైపు కృషి చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని అన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కేవీఆర్ కాలేజీ ప్రిన్సిపాల్ జి.లాలెప్ప, అధ్యాపకులు ప్రభు, రెహిమాన్, శ్రీనివాస కుమార్ పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోండి

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి సందర్భంగా శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్తున్న భక్తుల కోసం వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాటు చేసిన వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంచార చికిత్స నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు కోరారు. శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. జిల్లాలో రేమట, సి.బెళగల్, పొలకల్, గూడూరు, కోడుమూరు, పెంచికలపాడు, పెద్దపాడు, కల్లూరు, బళ్లారి చౌరస్తా, గార్గేయపురం, గోకులపాడు గ్రామాల్లో వైద్యశిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శైలేష్, జిల్లా ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లకు మహర్దశ

- రూ.2.75కోట్లు విడుదల చేసిన కూటమి ప్రభుత్వం
- తీరనున్న విద్యార్థుల కష్టాలు


ఆదోని ఎస్సీ బాలుర నెంబర్-1 హాస్టల్‌కు మరమ్మతులు

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్సీ హాస్టల్ విద్యార్థుల కష్టాలు తీరనున్నాయి. కూటమి ప్రభుత్వం ఆదోని సబ్ డివిజన్ పరిధిలో పట్టణంలోని నాలుగు ఎస్సీ హాస్టళ్లు, ఆస్పరి మండలంలో రెండు, కృష్ణగిరి మండలంలోని మరో రెండు హాస్టల్లో మరమ్మతులకు రూ.2.75కోట్లు నిధులను విడుదల చేసింది

బాగుపడనున్న ఆదోని ఎస్సీ హాస్టళ్లు..

పట్టణంలో రెండు ఎస్సీ హాస్టళ్లు ఉన్నాయి హాస్టల్ నెం.1, 2 ఉండగా ఈ భవనాలు శిథిలావస్థకు చేరాయి. విరిగిన కిటీకిలు పగిలిపోయిన తలపులు. పనిచేయని ఫ్యాన్లు, విద్యుత్ దీపాలు కనిపించేవి. అలాగే అధ్వానంగా మరుగుదొడ్లు కూడా అధ్వానంగా ఉండి అడుగు పెట్టలేని విధంగా ఉండేది. అయితే మరమ్మతులు ప్రారంభమవడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హాస్టళ్లను పట్టించుకోని వైసీపీ

గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం హాస్టళ్లను పట్టించుకోలేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. వీటి నిర్వహణను గాలికి వదిలేయడంతో విద్యార్థులు వసతి పొందేందుకు వీలు లేకుండా పోయింది. అయితే కూటమి ప్రభుత్వం సాంఘిక సంక్షేమ వసతి గృహాలపై దృష్టి పెట్టి నిధులు విడుదల చేసింది. టెండర్లు కూడా పూర్తికావడంతో కాంట్రాక్టర్లు పనులను ప్రారంభించారు.

పనులను ప్రారంభించాం



సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. టెండర్లు పూర్తయి, కాంట్రాక్టరులు పనులను కూడా ప్రారంభించారు. పనులు పూర్తయితే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందుతాయి. **- బాబు, ఏఎస్‌డబ్ల్యువో, ఆదోని.**

తీరనున్న విద్యార్థుల కష్టాలు

హాస్టల్ భవనాలు సరిగా లేక విద్యార్థులు ఇంతకాలం ఇబ్బంది పడ్డారు. అయితే కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో భవనాలకు మరమ్మతులు ప్రారంభించారు. దీంతో విద్యార్థుల కష్టాలు తీరనున్నాయి.

ఇవీ నిధుల వివరాలు

పట్టణంలోని ఎస్సీ బాలుర నెం.1 హాస్టల్‌కు రూ.20 లక్షలు, ఎస్సీ బాలికల హాస్టల్‌కు రూ.31.94లక్షలు, ఎస్సీ బాలుర హాస్టల్ నెం.2కు రూ.36.35లక్షలు, బాలికల సమీకృత హాస్టల్‌కు రూ.26.06లక్షలు, ఆస్పరి బాలుర హాస్టల్‌కు రూ.16లక్షలు, బాలికల హాస్టలకు రూ.13.4లక్షలు, క్రిష్ణగిరి మండలం ఎరుక చెరువు హాస్టల్‌కు రూ.37.6లక్షలు, కంభాలపాడు హాస్టల్‌కు రూ.92.33లక్షలతో మరమ్మతు పనులు చేయనున్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలు

ఆలూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాఘవరావు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఈనెల 24 నుంచి వచ్చేనెల 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష, 27న మెరిట్ లిస్టు, 30న కౌన్సెలిం గ్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తామని తెలిపారు.

వివాహిత అదృశ్యం

ఆదోని రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుప్పగల్లు గ్రామానికి వివాహిత ఈరమ్మ అదృశ్యమైంది. పెద్దతుంబళం ఎస్.ఐ మహేష్ కుమార్ తెలిపిన మేరకు.. ఐదేళ్ల క్రితం శిరుగుప్ప తాలుక నాగలాపురం గ్రామానికి చెందిన ఈరమ్మకు కుప్పగల్లుకు చెందిన తిరుపతితో వివాహమైంది. వీరికి కుమారుడు ఉన్నారు. ఈనెల 18న వీరు గొడవ పడ్డారు. 19న భర్త పొలాని వెళ్లి వచ్చి చూడగా భార్య కనిపించలేదు. ఈరమ్మ తండ్రి హుసేనప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏర్పాట్ల పరిశీలన

వెల్దుర్తి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మగుండంలో మహాశివరాత్రి ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. ఈవో ఆంజనేయులు సీఐ మధుసూదనరావు, ఎస్ఐ అశోక్ భక్తుల రద్దీ, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణపై చర్చించారు.

అర్హులందరికీ రుణాలు

తుగ్గలి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాలను అర్హులందరికీ ఇస్తామని ఎంపీడీవో విశ్వమోహన్ తెలిపారు. శుక్రవారం కార్యాలయంలో ఎంపీడీవో విశ్వమోహన్, తుగ్గలి, పెండేకల్, పత్తికొండ, పెరవలి బ్యాంకు మేనేజర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. రుణాలకు ఎంపికైన వారి జాబితాను త్వరలో ప్రకటిస్తామన్నారు.

'ప్రభుత్వంపై ఆరోపణలు తగవు'


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మద్దికెర, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం తగదని టీడీపీ నాయకుడు కేవీ రాజేశ్వర్ చౌదరి, తెలుగు యువత అధ్యక్షుడు మూలింటి రాము యాదవ్ విమర్శించారు. శుక్రవారం పెరవలి గ్రామంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9 నెలల్లో గ్యాస్, పింఛన్లు, డీఎస్సీ ప్రకటించిందన్నారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రజా సమస్యలపె దృష్టి పెట్టి పాలన చేస్తున్నారని, మండలంలో రూ.3కోట్ల అభివృద్ధి పనులు చేశారన్నారు. రంగస్వామి, మంగళి రంగస్వామి, నరసింహులు ఉన్నారు.

హామీలను అమలు చేయాలి

ఆదోని/టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులకు కూటమి ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్ బాబు డిమాండ్ చేశారు. గురువారం ఎమ్మెల్యే పార్థసారధికి


ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న కాంట్రాక్టు కార్మికులు

వినతి పత్రం ఇచ్చారు. ఇరవై ఏళ్లుగా పని చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయా లని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. జాన్‌బాబు, లక్ష్మన్న, శాంత, నరసింహులు, భాగ్యరాజ్, వీరేష్, అబ్బాస్ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పిస్తాం

ఆప్కాస్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఎమ్మెల్యే పార్థసారధి తెలిపారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. సీపీఐ నాయకులు అజయ్ బాబు, ఓబి నాగరాజు, వెంకప్ప పాల్గొన్నారు.

మార్చి 8న జాతీయ లోక్ అదాలత్


మాట్లాడుతున్న న్యాయాధికారి శ్రీవల్లి

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మార్చి 8న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని పత్తికొండ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఏపీఎస్ శ్రీవల్లి కోరారు. శుక్రవారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. హైకోర్టు ఆదేశాల మేరకు మార్చి 8న నిర్వహిస్తున్నామని కక్షిదారులు పరిష్కరించుకునేలా చూడాలని కోరారు. ప్రెసిడెంట్ రంగస్వామి పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆలూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం రాత్రి ముద్దనగేరి గ్రామంలో కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి తెలిపిన మేరకు.. ఈడిగ వెంకటేశులు ఇంట్లో 7 బాక్సుల్లోని 678 కర్ణాటక మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై ఇంద్రకరణ, సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న పొరుగుసేవల ఉద్యోగులు

ఆలూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): హౌసింగ్ శాఖలో 19 ఏళ్లుగా ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న తమకు హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని ఉద్యోగులు పత్తిపాడు ఎమ్మెల్యే రామాంజినేయులుకు విన్నవించారు. తమ సేవలను పరిగణనలోకి తీసుకొని కాంట్రాక్ట్‌లోకి మార్చాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. జేఏసీ ఉపాధ్యక్షుడు దాస్, కార్యదర్శి ఆలీ, గంగమ్మ, తిమన్న, అంజలి, తిప్పన్న, నాయుడు పాల్గొన్నారు.

నమోదును వేగవంతం చేయాలి

మద్దికెర, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రైతుకు విశిష్ట సంఖ్య నమోదును వేగవంతం చేయాలని ఏవో రవి అన్నారు. శుక్రవారం మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో నమోదును పరిశీలించారు. రైతులంతా నెలాఖరులోగా అడంగల్ 1బీ, ఆధార్, ఫోన్ నెంబర్లు ఇచ్చి నమోదు చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ అనంతరం 11విశిష్ట సంఖ్యగల కార్డు వస్తుందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సబ్సిడీ, పరిహారాలను పొందవచ్చన్నారు.

న్యాయవాదుల నిరసన

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో 2025 అడ్వకేట్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగస్వామి ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన అడ్వకేట్ సవరణ బిల్లు-2025 ప్రజాస్వామ్య విరుద్ధంగా, న్యాయవాదుల హక్కులకు భంగం కలిగేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సురేష్ కుమార్, సత్యనారాయణ, మైరాముడు, ఎల్లారెడ్డి, మల్లికార్జున, సురేంద్ర కుమార్, రాజశేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'మీరూ... ఇలాంటి భోజనమే తింటారా?'

- మోడల్ స్కూల్ హాస్టల్ సిబ్బందిపై ప్రత్యేకాధికారి ఆగ్రహం


విద్యార్థినులకు అన్నం వడ్డిస్తున్న ప్రత్యేకాధికారి నిర్మల

క్రిష్ణగిరి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): 'ఇళ్లలో మీరు కూడా ఇదే భోజనాన్ని తింటారా..' అంటూ ఐసీడీఎస్ పీడీ, మండల ప్రత్యేకాధికారి నిర్మల మోడల్ స్కూల్ హాస్టల్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆమె తహసీల్దార్ దేవ చంద్రశేఖర్, ఎంపీడీవో మోహన్ కుమార్‌తో కలిసి క్రిష్ణగిరి మోడల్ స్కూల్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. భోజనాన్ని పరిశీలించగా, ఉడికీ ఉడకని ముద్ద అన్నం, నీళ్ల చారు కపించాయి, అంతేగాకుండ 15 మంది విద్యార్థులకు అన్నం తక్కువగా వచ్చింది. దీంతో ఆమె సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆహారం ఇచ్చే విషయంలో విద్యార్థులను విచారించారు. మోనూ పాటించడం లేదని, రెండు నెలలుగా గుడ్డు ఇవ్వడంలేదని, సాయంత్రం స్నాక్స్ కూడా ఇస్తాను సారంగా ఇస్తున్నారని, రోజూ 10మందికి అన్నం తక్కువ వస్తుందని తెలిపారు. ప్రిన్సిపల్, వార్డెన్ సెలవు పెట్టకుండానే పాఠశాలకు గైర్హాజరవడంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

మాతృభాషను మరువరాదు

- ఘనంగా అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం


ఆదోని ఆర్‌ఆర్ లేబర్ కాలనీలో తెలుగు ఉపాధ్యాయులకు సన్మానం


దేవనకొండలో ఉపాధ్యాయురాలు..

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మాతృభాషను మరువరాదని నెహ్రూ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అలీంసిద్ధికి అన్నారు. మండలంలోని పాఠశాలల్లో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ వేడుకలు నిర్వహిచారు. పాఠశాలల్లో తెలుగుతల్లి, కృష్ణదేవరాయ కవుల వేషధారణతో చిన్నారులు ఆకట్టుకున్నారు. మాతృభాష ప్రాముఖ్యతపై ఉపాధ్యాయులు వివరించారు. పర భాష మోజులో పడి మాతృభాషను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భాషా సంస్కృతి వైవిధ్యాన్ని కాపాడుకోవాలని అరసం జిల్లా అధ్యక్షుడు కలం ప్రహ్లాద అన్నారు. కిల్చిన్ పేట పురపాలక ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం సునీల్ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో అలాగే ఆర్‌ఆర్ లేబర్ కాలనీ పురపాలక పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు రమేష్ నాయుడుని సన్మానించారు. పెద్ద హరివాణం జెడ్పీ పాఠశాలలో ఇందిరా దేవి ఆధ్వర్యంలో, నేషనల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో కరస్పాండెంట్ గోపాల్ రెడ్డి తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.

మృతభాష తల్లిలాంటిది

దేవనకొండ: మాతృభాష తెలుగు కన్న తల్లిలాంటిందని జెడ్పీపాఠశాల హెచ్‌ఎం మద్దిలేటి, తెలుగు ఉపాధ్యాయురాలు పల్లె ఉమాదేవి అన్నారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో మాతృభాష దినోత్సవ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు ఎక్కడికెళ్లిన మాతృబాష తెలుగుని విస్మరించకుండా, తెలుగు తియ్యదనం, గొప్పతనంగా తేలియజేయాలన్నారు.

జాతీయ రహదారి పూర్తయ్యేలా చూస్తాం


అధికారులతో చర్చిస్తున్న వీరభద్ర గౌడ్

- టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్

ఆలూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అసంపూర్తిగా ఉన్న జాతీయ రహదారి పనులు వారంలో పూర్తయ్యేలా చూస్తామని టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. శుక్రవారం నేషనల్ హైవే ఈఈ శంకర్ రెడ్డి, డీఈ సుధాకర్‌తో చర్చించారు. ఆరేళ్లగా పనులు నిలిచిపోయి, ప్రమాదాలు చోటుచేసుకుని ప్రాణాలు పోతున్నాయని, దుమ్ము, ధూళితో జనం అనారోగ్యం పాలవు తున్నారన్నారు. పత్తిపాడు ఎమ్మెల్యే రామా జినేయులు కూడా రాష్ట్ర స్థాయి అధికా రులతో మాట్లాడారన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆయన అధికారు లను కోరారు. కాంట్రాక్టర్ రఘునాథరెడ్డి ఉన్నారు.

సారా తయారీ మానండి.. పనులు చేసుకోండి


రోళ్లపాడులో ప్రజలతో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ విశ్వేశ్వరరావు

తుగ్గలి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సారా తయారీ మాని, పనులు చేసుకోవాలని పత్తికొండ ఎక్సైజ్ సీఐ విశ్వేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని రోళ్లపాడు తండా తదితర గ్రామాల్లో అవగాహన కల్పించారు. సారా అమ్మడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. గ్రామ శివారులో సారా బట్టీలపై దాడి చేసి 800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, సారాను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీదారులపై బైండోవర్, పీడీ యాక్టు నమోదు చేస్తామన్నారు. ఎస్ఐ సాయిప్రవీణ్, సర్దార్, తదితరులు ఉన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యం



మాట్లాడుతున్న న్యాక్ ఇన్‌చార్జి ఉలుగన్న

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యమని ఆదోని న్యాక్ శిక్షణ కేంద్రం ఇన్‌చార్జ్ బీజీ ఉలుగన్న పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. కేఐఎంఎల్ కంపెనీకి 2, హుందాయి కంపెనీలో 3, నవభారత్ కంపెనీలో 5 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నైపుణ్య అధికారి ఆనంద్ రాజ్ కుమార్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సాయితేజ, కోఆర్డినేటర్ రాజశేఖర్, శ్రీనివాస్, నరసప్ప పాల్గొన్నారు.

పుస్తెలు వద్దు.. పుస్తకాలే ముద్దు

బాల్య వివాహాలు వద్దని విద్యార్థుల ర్యాలీ


ఆలూరులో మానవహారం నిర్మించిన విద్యార్థినులు



దేవనకొండ బస్టాండ్ అవరణలో విద్యార్థినుల నినాదాలు


హాలహర్వి: ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో, సిబ్బంది

ఆలూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టాలని శుక్రవారం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ కూడలిలో మానవహారం నిర్మించారు. హెచ్‌ఎం సుజాత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి పాల్గొన్నారు.

ఆదోని అగ్రికల్చర్: బాల్య వివాహాలు చేయడం నేరమని కుప్పగల్లు ఉన్నత పాఠశాల హెచెం చంద్రశేఖర్ అన్నారు. గురువారం గ్రామంలో బాల్య వివాహహాలను అరికట్టాలని విద్యార్థులు ర్యాలీ చేపట్టారు.

దేవనకొండ: పుస్తెలు వద్దు పుస్తకాలే ముద్దని కస్తూర్బా పాఠశాల విద్యార్థినులు నినాదాలు చేశారు. బాల్య వివాహాలు చేయొద్దని శుక్రవారం దేవనకొండలో ర్యాలీ నిర్వహించారు. తల్లిదండ్రులు పిల్లలకు బాల్య వివాహాలు చేయకుండా, చదివించాలని కోరారు. బాలిక చదువుతో దేశానికి భద్రత ఉంటుందని ప్రిన్సిపాల్ సునీత అన్నారు. ఉపాధ్యాయినులు లీలా, మంజుల, రేణుక, గీత పాల్గొన్నారు.

హాలహర్వి: బాల్యవివాహాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో వరలక్ష్మి హెచ్చరించారు. శుక్రవారం హాలహర్విలో విద్యార్థినులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. గ్రాఆల్లో బాల్యవివాహలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. ఐసీడీఎస్ సుపర్ వైజర్లు చందన, చంద్రవతి పాల్గొన్నారు.

తుగ్గలి: బాల్య వివాహాలు నేరమని హెచ్‌ఎం రాజామోహన్, పీడీ చందూ నాయక్ అన్నారు. శుక్రవారం తుగ్గలి జడ్పీ హై స్కూల్‌లో ర్యాలీ నిర్వహించారు. 21 సంవత్సరాలు పూర్తయ్యాక పెళ్లి చేస్తే సమాజంపై అవగాహన ఉండి చక్కగా కాపురాలు చేసుకుంటారన్నారు. ఉపాధ్యాయులు సుధాకర్, భాస్కర్, చాంద్, రంగనాయక్, శ్రీనివాసులు, రిజ్వాన, తదితరులు ఉన్నారు.

మద్దికెర: బాల్య వివాహాలు నేరమని ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి, ఎంపీడీవో కొండయ్య అన్నారు. శుక్రవారం కస్తూర్బా పాఠశాల విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహలతో అనారోగ్యం, రక్తహీనత, మాతాశిశు మరణాలు సంభవిస్తాయన్నారు. 18 ఏళ్లలోపు ఉన్న ఆడపిల్లలకు వివాహం చేస్తే 2ఏళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తారని హెచ్చరించారు. ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్ బాషా, హెల్త్ ఎడ్యుకేటర్ అంజలి ఉన్నారు.

టమోటాకు గిట్టుబాటు ధర కల్పిస్తాం


రైతులతో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్

ఆస్పరి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): టమోటాకు గిట్టుబాటు ధర కల్పిస్తామని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. శుక్రవారం బిల్లేకల్ గ్రామం కూరగాయల మార్కెట్‌ను పరిశీలించారు. టమోటా, చోళకాయా, బీరకాయ, వంకాయ, బెండకాయ తదితర కూరగాయల ధరల వివరాలను తెలుసుకున్నారు. అటికల్ బాబు, శేషాద్రి నాయుడు, సతీష్ కుమార్, మహేష్, వీరేష్, నారాయణ, కరుణాకర్, శాలిసాహెబ్, మధు, యుగందర్ పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడులు

ఆదోని, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివార్లలో కొండల్లో సారా స్థావరాలపై ఎక్సైజ్ సీఐ సైదుల్లా సిబ్బందితో దాడులు నిర్వహించారు. వంద 500 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేశారు. విషయం తెలిసిన నిర్వాహకులు ముందుగానే ఉడాయించారు.

హమాలీల కూలి రేట్లు పెంచాలి

ఆలూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లై గోదాం కూలి రేట్లు పెంచాలని హమాలీలు డిమాండ్ చేశారు. శుక్రవారం గోదాం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు మార్చి 7న విజయవాడలో ఎండీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతామన్నారు.

సారా తయారీ మానుకోవాలి

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సారా తయారీ మానుకోవాలని, అలా చేయని పక్షంలో కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ సీఐ విశ్వేశ్వరరావు హెచ్చరించారు. శుక్రవారం రోళ్లపాడు తండాలో గ్రామ సభ నిర్వహించారు. అనంతరం 800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. హెడ్ కానిస్టేబుల్ సర్దార్, సిబ్బంది ఉన్నారు.

అన్ని దానాల కన్నా రక్తదానం మిన్న

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి



రక్తదానం చేస్తున్న టీడీపీ నాయకులు

మంత్రాలయం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): అన్నిదానాల కన్నా రక్తదానం మిన్న అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మాధవరంలో తన నివాసంలో పుట్టిన రోజు వేడుకలను ఘనంగా కార్యకర్తలతో జరుపుకున్నారు. కార్యకర్తలు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్, బాలకృష్ణ అభిమానులు పాల్గొని 200 మంది రక్తదానం చేశారు. కేక్ కట్ చేసి శాలువ, పూలమాలతో రాఘవేంద్రరెడ్డిని సన్మానించారు. అదేవిధంగా మంత్రాలయంలో రాఘవేంద్ర సర్కిల్‌లో టౌన్ అధ్యక్షులు వరదరాజు, అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రఘునాథరెడ్డి, రామకృష్ణారెడ్డి, రాకేష్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేష్, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, ఎంపీటీసీ వెంకటేష్, శివ, ముత్తురెడ్డి, ఏసేపు, చాపల నగేష్, పవన్ కుమార్ రెడ్డి, గోపాల్, సుల్తాన్, పల్లెపాడు రామిరెడ్డి, ముత్తురెడ్డి, వెంకటపత్తిరాజు, అడివప్పగౌడు పాల్గొన్నారు.

భార్యపై దాడి : కేసు నమోదు

మంత్రాలయం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని వగరూరు గ్రామానికి చెందిన షబ్బీర్ మద్యం తాగి వచ్చి భార్య షేక్ షెహనాజ్‌పై కట్టెతో దాడిచేసి గాయపరిచాడు. ఈ సంఘటన శుక్రవారం జరిగింది. షబ్బీర్, షేక్ షెహనాజ్ దంప తులకు ఇద్దరు కవల కూతుళ్లు ఉన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వివరాలు... రెండేళ్ల క్రితం షబ్బీర్ మద్యానికి బానిసై అనుమానంతో భార్యను హింసించేవాడు. ఆడ పిల్లలను కంటావా? అని వేధించసాగాడు. శుక్రవారం తాగి వచ్చి భార్యను తల పగిలేలా కొట్టాడు. స్థానికులు ఆమెను ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. షబ్బీర్‌పై కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మంత్రాలయం హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ తెలిపారు.

వేధింపుల కేసు నమోదు

మంత్రాలయం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కట్నం కోసం భర్త, అత్తమామలు తనను వేధిస్తున్నారని మంత్రాలయం రామచంద్రనగర్‌కు చెందిన ఎంకే సింధూజ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేసింది. మంత్రాలయంలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్న సింధూజ, ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన ఏపీఎస్పీ కానిస్టేబుల్ ఉరుకుంద 2014లో ప్రేమవివాహం చేసుకున్నారు. వీరికి 9 ఏళ్ల కూతురు కావ్యశ్రీ ఉంది. ఉరుకుంద షేర్‌మార్కెట్ సర్వం కోల్పోయి మద్యానికి బానిసై ఉద్యోగం పోగొట్టుకున్నాడు. కట్నం తీసుకరావాలని సింధూజను భర్త, అత్త లక్ష్మీదేవి, మామ దేవేంద్ర, ఆడపడచు నాగవేణి వేధిస్తూ వచ్చారు. దీంతో ఆమె మంత్రాలయం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఆ నలుగురిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ తెలిపారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



నిరసన తెలుపుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

మంత్రాలయం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని వగరూరు గ్రామంలో మురికి కాలువలు, జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన మట్టిరోడ్లు పొలానికి వెళ్లే రహదారులు వెంటనే నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్ యాదవ్, మండల కార్యదర్శి లక్ష్మణ్ నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం వగరూరు గ్రామంలో మౌలిక సదుపాయాలు, పొలాలకు వెళ్లే రహదారులను పరిశీలించారు. రైతులు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే ఉపాధి కూలీలతో మట్టి రోడ్లను ఏర్పాటు చేసి నీటి కాలువలను శుభ్రపరిచి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు హనీఫ్, మాబు హుశేన్, నరసప్ప, శ్రీనివాసులు, తిమ్మప్ప పాల్గొన్నారు.

నేటి నుంచి అల్లిసాహెబ్ స్వామి ఉరుసు



అల్లిసాహెబ్ స్వామివారి దర్గా

గోనెగండ్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హెచ్ కైరవాడి గ్రామంలో జరిగె అల్లీసాహెబ్ స్వామి ఉరుసు ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. 22న స్వామివారి గంధం, 23న ఉరుసు, 24న జియారత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఉత్సవానికి పలు రాజకీయ పార్టీల నాయకులు ప్రజాప్రతినిధులు, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం ప్రాంతాల ఎమ్మెల్యేలు హాజరవుతారు.

పూలచింత వాసికి డాక్టరేట్

నందవరం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూలచింత వాసి ప్రకాష్‌గౌడుకు డాక్టరేట్ అవార్డు వచ్చింది. కడప యోగివేమన యూనివర్శిటీలో మాథ్యమాటిక్స్ విభాగంలో పరిశోధన చేసిన ఈయనకు అవార్డు లభించింది. ప్రొఫసర్ కాత్యాయని పర్యవేక్షణలో అప్లైడ్ మాథ్యమెటిక్స్‌లోని 'థియోరిటికల్ ఇన్వెస్టిగేషన్ ఆఫ్ వేరియర్ హైబ్రిడ్ నానో ఫ్లోయిడ్ ఫ్లోస్ ఓవర్ ఆన్ ఎక్స్‌పోన్షి స్ట్రెచ్చింగ్ షిట్ విత్ థర్మల్ రేడియేషన్ యన్ ఇరెవర్శిబిలిటి అనాలసిస్' అనే అంశంపై పరిశోధన చేశారు. ప్రకాష్ గౌడు ప్రస్తుతం కర్ణాటకలోని చిక్కబళ్లాపూర్ బైరవేశ్వర విద్యాసంస్థలో ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నారు.

అర్హులందరికీ రుణాలు అందించాలి

గోనెగండ్ల, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వార మంజూరు చేసే రుణాలను ప్రభుత్వం వివక్షత చూపకుండా అర్హులందరికీ అందించాలని ఎమ్మిగనూరు నియోజకవర్గ బీసీసెల్ అధ్యక్షుడు మురళీనాయుడు కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బీసీ వర్గాలకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అందించే రుణాలను, ఇతర పథకాలను అర్హులందరికీ సమానంగా ఇవ్వాలన్నారు.

దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

గోనెగండ్ల, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి శుక్రవారం ఎంపీడీవో సమావేశ భవనంలో పలు బ్యాంక్ మేనేజర్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. 345 మంది దరఖాస్తు చేసుకోగా ఇంటర్వ్యూలకు కేవలం 138 మంది మాత్రమే హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పలు బ్యాంక్ అధికారులు, ఎంపీడీవో సిబ్బంది పాల్గొన్నారు.

మిరప రైతు కన్నీరు

- తగ్గిన ధర, పెరిగిన పెట్టుబడులు
- దిగుబడి అంతంత మాత్రమే
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు
- ఆదుకోని ప్రభుత్వం



మిరప పంట

నందవరం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మిరప రైతులు ఏటా నష్టాల బారిన పడుతున్నారు. గత ఏడాది వర్షాల వల్ల పంటలన్నీ దెబ్బతినగా, ఈ ఏడాది ధరలు లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వేలకు వేలు పెట్టిబడులు పెట్టి సాగు చేస్తే రవాణా ఖర్చులు కూడా రావడం లేదని రైతులు లబోదిబోమంటున్నారు. మండలాల్లో దాదాపు 17వేల ఎకరాల్లో మిరపను సాగుచేశారు. అయితే సాగు చేసిన పంటకు బూడిద, వేరుకుళ్లు తెగులు సోకడంతో పంటకు పట్టిన పూత, కాయ రాలిపోతుంది. కాయపట్టే సమయంలో ఈ తెగుళ్లు సోకడంతో పంట దిగుబడి తగ్గిపోయింది. ఆదేవిధంగా చేతికి అందిన పంటను మార్కెట్ తీసుకువెళ్లగా అక్కడ క్వింటం మిరప పంట ధర రూ. 9000 నుంచి రూ. 12000 లోపే పలుకుంది.

వేల ఎకారాల్లో పంట నష్టం: మండలంలో దాదాపు 4వేల ఎకరాల్లో పంటకు బూడిద, వేరుకుళ్లు తెగులు సోకి నట్లు తెలుస్తోంది. ఎన్ని పిచికారి మందులు వాడినప్పటికీ తెగుళ్లు అదుపులోకి రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరం మిరపపంట సాగుచేయాలంటే సుమారు రూ 1.50 లక్షల వరకు పెట్టబడిపెట్టాల్సి ఉంటుంది. కౌలు రైతులు అయితే మరో రూ. 40 వేల అదనంగా ఉంటుంది. అరకొర గా పండిన పంటకు గిట్టుబాటు ధర లేదు. కూలీలకు, పిచికారి మందులకే సరిపోతుంది.

రూ.20 లక్షలు పెట్టుబడి పెట్టా



తాను 14 ఎకరాల్లో మిరప పంట సాగు చేశా. ఇప్పటికే రూ. 20 లక్షలు పెట్టుబడి పెట్టా. పంటంతా వైరస్ సోకింది. అధికారులు ఎవరూ పంట వైపు తొంగి చూసిన పాపాన పోలేదు. పండిన పంటకు గిట్టు బాటు ధర లేదు. నాణ్యమైన మొదటి రకం మిరప పంటకు క్వింటం ధర రూ. 12000 లోపు ఉంటుంది. రెండో రకం మిరపకు రూ. 8 నుంచి 9వేల లోపే ధర పలుకుంది. పెట్టిన పెట్టుబడి చేతికి అందడం లేదు.

\- రుక్మాన్, రైతు, ముగతి

వాటర్ గ్రిడ్‌కు రూ.290 కోట్లతో ప్రతిపాదనలు: ఎమ్మెల్యే



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

గోనెగండ్ల, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): నియోజయవర్గంలోని ప్రతి గ్రామానికి తాగునీటి సమస్య లేకుండా చేసేందుకు గాను వాటర్ గ్రిడ్ పనులు చేపట్టేందుకు గాను రూ. 290 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వాన్ని పంపామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. గోనెగండ్లలో జలజీవన్ మిషన్ పనుల కింద ఓహెచ్‌ఆర్ ట్యాంక్, పైప్‌లైన్ పనులకు గాను రూ. 2.50 కోట్లు విడుదల కావడంతో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు. అలాగే బీసీ కాలనీలో వేసిన రోడ్డు లను ఆయన ప్రారంభించారు. బీవీ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి తాగునీటి సమస్య లేకుండా చేస్తామని అందుకు గాను రూ. 290 కోట్లు తో ప్రతిపాధనలు తయారు చేశామన్నారు. గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి నీటిని మళ్లించి గ్రామాలలో తాగునీటి సమస్య లేకుండా చేస్తామని తెలిపారు. గోనెగండ్లలో శాశ్వత తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు గాను జలజీవన్ మిషన్ ద్వారా మూడు ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌లతో పాటు గ్రామంలోకి కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికి ఉచితంగా కొళాయిని ఇస్తామన్నారు. గ్రామంలో దాదాపు 1700 కొళాయిలు కొత్తగా కనెక్షన్ చేస్తామని తెలిపారు. దీంతో గ్రామంలో నెలకొన్న తాగేనీటి సమస్య తీరుతుందన్నారు. అనంతరం టీడీపీ కార్యకర్తల ఇండ్లకు వెళ్లి వారిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్, పీఆర్‌డీఈ చంద్రశేఖర్, పీఆర్‌ఏఈ శివశంకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ కుమారస్వామి, ఎంపీడీవో మణిమంజరి, సీఐ గంగాధర్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా మాతృ భాషా దినోత్సవం



మాట్లాడుతున్న ఉపాధ్యాయురాలు

కౌతాళం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మాతృ భాష తల్లిలాంటిదని దానిని ఎప్పుడు చులకనగా చూడ రాదని కౌతాళం కెనరా బ్యాంకు మేనేజర్ సద్దాం అలీ అన్నారు. కౌతాళంలోని ప్రతిభ హైస్కూల్‌లో శుక్రవారం అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని పాఠశాల కరస్పాండెంట్ దూద్ బాషా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కౌతాళం కెనరా బ్యాంకు మేనేజర్ సద్దాం అలీ హాజరయ్యారు. ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానేశ్వరి, ఉపాధ్యాయులు ఖైనుద్దీన్, భామేష్, శిరీష, జయలక్ష్మి ఉన్నారు.

కోసిగి: ప్రస్తుత కాలంలో మాతృభాషకు ఆయుష్షు తగ్గిపోతోందని, ఆంగ్లంపై మోజుతో మాతృభాష మరుగున పడుతుందని పల్లెపాడు ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు నెల్లూరు వెంకటలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పల్లెపాడు జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు దస్తగిరి బాషా మాట్లాడుతూ తల్లిదండ్రుల నుంచి సహజంగా అలవడిన భాష మాతృభాష అని, నేడు పరబాషను నేర్చుకునే క్రమంలో మాతృభాషను మరిచిపోతున్నారన్నారు. విద్యార్థులకు పద్యపోటీలు, ఆంగ్లపదం వాడకుండా ఉపన్యసించడం, తెలుగు టంగ్ కిష్టర్ వంటి వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామమూర్తి, శ్రీధర్‌బాబు, ఆనంద్, వేణుగోపాల్, శాంతన్న, నాగేంద్ర ప్రసాద్, వేణుగోపాల్, నాగరాజు, ధనుంజయ్, వెంకటేశ్, వీరేష్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, చేనేతలకు నిధులు

మంత్రాలయం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ఎన్టీఆర్ కాలనీ పేరు మీదుగా పట్టాలు ఇచ్చి బేస్‌మట్టం లెవల్ నుంచి స్లాబ్ లెవెల్ వరకు నిర్మించి మధ్యలో వివిధ దశల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, చేనేతలకు అదనంగా రూ.50వేలు ఇస్తున్నట్లు హౌసింగ్ డీఈ లాల్ కృష్ణయ్య తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్టీఆర్ పీఎం ఏవై(యు) కింద ఎస్సీలకు, చేనేతలకు గత ప్రభుత్వం ఇచ్చిన రూ.1.80లక్షలకు అదనంగా ఎస్సీ చేనేతలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు అదనంగా ఇస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ

గోనెగండ్ల, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు అందజేస్తున్నట్లు కంటి వైద్యులు రమేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం గోనెగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాలలో విద్యను అభ్యసిస్తు కంటి చూపు సరిగా లేని విద్యర్థులను గుర్తించి వారికి ఉచితంగా అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నాగభూషణం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి పేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్యం కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న 17మందికి రూ.18లక్షల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఖాశింవలి, వెంకటరామిరెడ్డి, కటారి రాజేంద్ర, అన్నపూర్ణమ్మ, తురేగల్ నజీర్, రాజు, మహేష్, గుల్లా సలాం, వడ్డె గోవిందు, బాధితులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం: మహాశివరాత్రి సదర్భంగా నందవరం మండలం గురుజాలలో వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయంలో జరిగే ఉత్సవాలకు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డికి ఎండోమెంట్ ఈవో రాంప్రసాద్, రికార్డు అసిస్టెంట్ ఆచారి, ఎమ్మిగనూరు నీలకంఠేశ్వరస్వామి దేవాలయం జూనియర్ అసిస్టెంట్ శివకేశవ ఆహ్వానించారు. శుక్రవారం ఎమ్మెల్యేను ఆయన స్వగృహంలో కలిసి ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందజేసి ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు.

బాల్య వివాహాలను అరికడదాం

ఎంఈవో-2 శోభారాణి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కోసిగి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టినప్పుడే బాల్యాన్ని రక్షించుకోగలుగుతామని ఎంఈవో-2 శోభారాణి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కోసిగితో పాటు డి.బెళగల్, సాతనూరు, కందుకూరు, వందగల్లు, ఆర్లబండ, జంపాపురం తదితర గ్రామాల్లో బాల్యవివాహాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కోసిగిలోని బాలురు, బాలికల ఉన్నత పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులతో కలిసి ఎంఈవో-2 శోభారాణి, ప్రధానోపాధ్యాయురాలు నాగేశ్వరిదేవి, ఖలీల్ అహ్మద్ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ అధికారుల సమక్షంలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా వాల్మీకి సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ క్యాత్యాయని, భాగ్యలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు రాజమౌళి, సంజన్న, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నాటుసారాలేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

మంత్రాలయం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం తాండ, పరమాన్‌దొడ్డి తాండలను నాటుసారాలేని గ్రామాలుగా తీర్చిదిద్దుతామని ఎమ్మిగనూరు ఎక్సైజ్ సీఐ రమేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మాధవరం తాండలో రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మంగా నాటుసారా నిర్మూలనకోసం నవోదయం 2.0 కార్యక్రమాన్ని ఏర్పాటులో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. నాటుసారా తయారుచేయడం మానివేసి సామాజిక బాధ్యతగా ప్రత్యామ్నాయ జీవన పద్ధతిని చూసుకోవాలని సూచించారు. ఇందుకు గ్రామస్తులంతా సమష్టిగా తీర్మానం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు ఎంపీడీవో బంగారమ్మ సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తమ గ్రామాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఆయాశాఖల అధికారులు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం సేవలు అందించేందుకు అన్ని రకాల నిధులను మంజూరు చేస్తుందని, గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు జయన్న, ప్రేమ్‌కుమార్‌లతో పాటు ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

వర్గీకరణను వేగవంతం చేయాలి

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ సమావేశాలలో ఎస్సీ వర్గీకరణను వేగవంతం చేయాలని నవ్యాంధ్ర ఎమార్పీఎస్ డివిజన్ అధ్యక్షుడు డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలలో భాగం గా ఎస్సీ వర్గీకరణకు ఇచ్చిన హామిని రాబోయే అసెంబ్లీ సమావేశాలలో బిల్లును ప్రవేశపెట్టి వెంటనే అమలు చెసే విధంగా అడుగులు వేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రసన్నకుమార్, యేసురాజు, సుంకన్న పాల్గొన్నారు.

రేపు బండేగురు స్వామి జాతర



బండేగురుస్వామి ఆలయం

నందవరం ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూలచింత గ్రామంలో బండేగురు స్వామి 119వ జాతర మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహిస్తున్నట్లు టీడీపీ సీనియర్ నాయకులు, ఉప పీఠాధిపతి బండేగురు స్వామి, పూలచింత సర్పంచ్ అక్కామంబాదేవి తెలిపారు. 23న ఉదయం సుప్రభాత సేవ, బండేగురు మూర్తికి రుద్రాభిషేకం, పల్లకోత్సవం, నందికోలుసేవ, మూలస్థానానికి పూజ కార్యక్రమం, సాయంత్రం రథోత్సవం, రాత్రికి అఖండా భజన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమానికి పూలచింత, నందవరం, కనకవీడు, నదీకైరవాడి, నందవరం, గోనెగండ్ల మండలం, ఎమ్మిగనూరు పట్టణంతోపాటు, కర్ణాటక, తెలంగాణ నుంచి అధికంగా భక్తులు తరలివస్తారు.

ఇటుకల బట్టి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు ప్రాంతంలోని మంత్రాలయం రోడ్డులో ఉన్న ఎస్‌ఎంఎస్ బ్రిక్స్ ఇటుకల బట్టి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు మారుతి డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ శేషఫణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటుకల బట్టి యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా బట్టిని నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాగరాజు, పరమేష్ లు పాల్గొన్నారు.

మెడికల్ బేబి కిట్ల అందజేత

కోసిగి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం కోసిగి ప్రభుత్వ ఆసుపత్రిలో పుట్టిన పిల్లలకు బేబీ మెడికల్ కిట్లను మాధవరం హై స్కూల్ చెందిన 2007 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు, రాఘవేంద్ర రెడ్డి అభిమానులు మెడికల్ బేబి కిట్లు మెడికల్ బేబీ కిట్లు మెడికల్ ఆఫీసర్ డా. మనోజ్ కుమార్, డా. రజితలకు అందజేశారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, ఖాజా, రాముడు, అయాఫ్, శ్రీకాంత్, నరసింహులు, గోపాల్ రవి, ఈరన్న, మీసేవా నరసింహులు, గోపాల్, ఈరన్న ఆచారి, ఆదెప్ప, రామాంజని పాల్గొన్నారు.

పల్లెపాడు మీదుగా విద్యార్థి బస్సు నడపాలి

కోసిగి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంట, పల్లెపాడు మీదుగా ఎమ్మిగనూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులు పల్లెపాడు మీదుగా విద్యార్థి బస్సును నడపాలని ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపో మేనేజర్ నాయక్‌కు ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్ వినతి పత్రం అందజేశారు. వీరేష్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్, పదో తరగతి పబ్లిక్ పరీక్షల సమయంలో గ్రామాల విద్యార్థులకు రవాణా సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు విష్ణు, వీరేష్, వీరేంద్ర ఉన్నారు.

మంత్రాలయానికి భక్తుల పాదయాత్ర

మంత్రాలయం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం కర్ణాటకలోని హోస్పెట్ జిల్లా కొక్లా పట్టణానికి చెందిన దాదాపు 150 మంది భక్తులు 220 కిలోమీటర్ల పాదయాత్రతో మంత్రాలయం చేరుకున్నారు. ఈ నెల 13న కొక్లా పట్టణం నుంచి విఠలాచార్య, దంగూరు ఆధ్వర్యంలో 54వ సారి పాదయాత్రను పురస్కరించుకుని దాదాపు 150 మంది మహిళలు, పిల్లలు, పురుషులు పాదయాత్రతో శుక్రవారం మంత్రాలయం చేరుకున్నారు. మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. రథోత్సవాల్లో, పూజల్లో పాల్గొని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆశీస్సులు పొందారు. దాదాపు 8 రోజులుగా 220 కిలోమీటర్లు పాదయాత్ర చేసి రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నామని పాదయాత్ర మండలి సభ్యులు తెలిపారు.

కోర్టుల ఏర్పాటుకు స్థలాల పరిశీలన



తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా న్యాయాధికారి కబర్ధి

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎమ్మిగనూరుకు మంజూరు చేసిన సబ్‌కోర్టు, జిల్లా అదనపు కోర్టుల ఏర్పాటుకు భవనాల నిర్మాణాలకు స్థలాలను జిల్లా న్యాయాధికారి కబర్ధి పరిశీలించారు. శుక్రవారం స్థానిక జూనియర్ సివిల్ న్యాయాధికారి హేమ, బార్ అసోసియేషన్ న్యాయవాదులు పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానించారు. అనంతరం ఆయన స్థానిక కోర్టు ఆవరణలో ఉన్న స్థలాన్ని, పాత మున్సిపల్ కార్యాలయం, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల ప్రాంగాణాల్లో ఉన్న స్థలాలను పరిశీలించారు. అంతేగాక ఆదోని రోడ్డులో ఉన్న టీబీపీ కార్యాలయం పక్కనే ఉన్న స్థలాలను పరిశీలించారు. ఆయన వెంట బార్ అసిసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురురాజారావు, రఘురాము, న్యాయవాదులు మామిడి మల్లికార్జున, జగన్నాథరెడ్డి, దామోదర్‌రెడ్డి, నారాయణ, సల్మాన్, మల్లికార్జునరెడ్డి, యంకన్న, ఉరుకుందు, దస్తగిరి ఉన్నారు.

మెగా డీఎస్సీని విడుదల చేయాలి

మంత్రాలయం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీని వెంటనే విడుదల చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రాజీవ్, మంత్రాలయం పట్టణ కార్యదర్శి రాజులు డిమాండ్ చేశారు. శుక్రవారం సమావేశంలో మాట్లాడుతూ అమరావతిని ఫ్రిజోన్‌గా ప్రకటించాలని, ఏపీపీఎస్సీ జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఓర్వకల్లులో పారిశ్రామిక హబ్ ఏర్పాటయ్యే పరిశ్రమలలో స్థానికంగా ఉండే యువతకే 70 శాతం ఉద్యోగాలు కల్పించే విధంగా జీవో తీసుకురావాలన్నారు. మంత్రాలయం ఉపాధ్యక్షులు విజయ్, నాయకులు మనోజ్, మురళి, ప్రణయ్ పాల్గొన్నారు.

ఇంటర్ విద్య కీలకం: ఎంఈవో

మంత్రాలయం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో ఉన్నత స్థానంలో ఉండాలంటే ఇంటర్ విద్య కీలకమని ఎంఈవో రాగన్న, ప్రిన్సిపాల్ రమేష్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, పరుగు పందెం, వ్యాసరచన, వకృత్వం వంటి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మెమెంటోలు, మెడల్స్ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటర్ నుంచి కష్టపడి చదివి జీవితం సుఖమంతమయం కావాలంటే ఇంటర్‌లోనే నిర్ణయించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వీరేష్, అధ్యాపకులు శ్రీనివాసులు, వీరన్నగౌడు, మద్దిలేటి, మల్లన్న, ప్రభాకర్, రామకృష్ణ, వెంకటస్వామి, రమేష్, సునీత, జీవనందపాల్, మంజుల, రాఘవేంద్ర, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి బయల్దేరిన భక్తులు



ఇరుముడితో శ్రీశైలానికి బయల్దేరిన శివస్వాములు

ఎమ్మిగనూరు/పెద్దకడుబూరు/రూరల్, కౌతాళం ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని శివస్వాములు మండలం, అర్థమండలం శివదీక్ష తీసుకొని శివరాత్రి సమీపిస్తుండడంతో పాదయాత్రతో శ్రీశైలం మల్లికార్జునస్వామిని దర్శించుకునేందుకు శుక్రవారం బయల్దేరి వెళ్లారు. పట్టణంలో అయ్యప్పస్వామి ఆలయంలో శివస్వాములకు గురుస్వాములు ఇరుముడులు కట్టారు. పట్టణం నుంచి దాదాపు 80మంది బల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా శివస్వాములను కర్నూలు రోడ్డులో ఉన్న బాటమారెమ్మ దేవలయం వరకు ఊరేగింపు నిర్వహించి సాగనంపారు. అలాగే పెద్దకడుబూరు మండలంలోని దొడ్డిమేకల గ్రామం నుంచి 100 మంది శివస్వాములు శ్రీశైలానికి బయల్దేరి వెళ్లారు. ఎమ్మిగనూరు మండలంలోని దేవిబెట్ట గ్రామం నుంచి దాదాపు 50 మంది శివభక్తులు శ్రీశైలానికి బయల్దేరి వెళ్లారు. కౌతాళం మండలం ఓబుళాపురం, ఉరుకుంద గ్రామాలకు చెందిన శివమాల వేసిన శివస్వాముల వారు శుక్రవారం శ్రీశైలానికి బయలుదేరారు.